జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం




రంగారెడ్డి | సోమవారం 23 జూన్ 2025 | సంపుటి : 15 | సంచిక : 284 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## ఏడాది పాలనపై కూటమి ప్రభుత్వం సమావేశం

'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో అమరావతిలో సమావేశం

కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు

ఏడాది సంక్షేమం, అభివృద్ధిపై సమీక్ష, భవిష్యత్ లక్ష్యాలపై చర్చ.. సమావేశం అనంతరం విందు





## జగన్‌పై కేసు నమోదు

- గుంటూరు ఎస్పీ ప్రకటన
- సింగయ్య మృతి కేసులో జగన్‌తో పాటు డ్రైవర్, మరికొందరు నేతల పేర్లు చేర్చిన పోలీసులు
- ఈ నెల 18న గుంటూరు ఏటుకూరు రోడ్డులో ప్రమాదం
- జగన్ కారు కింద సింగయ్య పడినట్లు వీడియో ఆధారాలున్నాయన్న ఎస్పీ
- అనుమతికి మించి కాన్వాయ్‌లో వాహనాలున్నాయని వెల్లడి

## వచ్చే ఏడాది స్థానిక సంస్థల

# ఎన్నికలు

- లోకల్ బాడీ ఎలక్షన్స్‌కు ప్రిపేర్...
- మరో నాలుగేళ్లు అధికారంలో ఉండటంతో అధికార పార్టీ వైపు ప్రజలు కూడా మొగ్గు చూపుతారు
- అధికార పార్టీకి చెందిన వారు ఎన్నికయితే తమ సమస్యలను పరిష్కరిస్తారని భావించి అటు వైపు చూస్తారు
- అయితే ఏపీ రాజకీయాలను నమ్మలేం



**విజయవాడ**

ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయాలు మామూలుగా లేవు. ఇక వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, పంచాయతీలు ఇలా స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూటమి పార్టీలు, వైసీపీ అమితుమీ తేల్చుకోవడానికి సిద్ధమయ్యాయి. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి పెద్దగా ఇబ్బంది ఉండదు. అందులో పార్టీ సింబల్ ఉండదు. కాకపోతే పార్టీ బలపర్చిన అభ్యర్థులే గెలిచి సర్పంచ్, ఉప సర్పంచ్ లుగా ఎన్నికవుతారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో మాత్రం ఖచ్చితంగా పార్టీ సింబల్ ఉండటం, బీఫారాలు కూడా - మిగతా3లో

## కూటమి ప్రభుత్వం మరోసారి

# రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోంది

- ఏపీ ప్రభుత్వం మరో రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతోందని జగన్ ఆరోపణ
- జూన్ 24న ఏపీఎండీసీ ద్వారా బాండ్ల జారీకి ప్రయత్నాలు చేస్తోందని వెల్లడి
- రాష్ట్ర సంచిత నిధికి ప్రైవేటు వ్యక్తులకు అనుమతిస్తున్నారని విమర్శ
- ఏపీఎండీసీ భవిష్యత్ రాబడులు, ఖనిజ సంపద తాకట్టు పెడుతున్నారన్న జగన్
- హైకోర్టులో కేసు విచారణలో ఉండగా బాండ్ల జారీ అనుచితమని వ్యాఖ్య



**విజయవాడ**

ఆంధ్రప్రదేశ్ లోని కూటమి ప్రభుత్వం మరోసారి భారత రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోందని, రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) ద్వారా జూన్ 24న నిబంధనలకు విరుద్ధంగా, మునుపెన్నడూ లేని విధంగా నాన్-కన్వర్టబుల్ డిబెంచర్ల (ఎన్సీడీ) రూపంలో బాండ్ల జారీకి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఆయన పలు కీలక అంశాలను లేవనెత్తుతూ ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. రాష్ట్ర శాసనసభ ఆమోదం లేకుండా రాష్ట్ర ఖజానా నుంచి నిధుల ఉపసంహరణకు వీలు కల్పిస్తూ, ప్రైవేటు పార్టీలకు రాష్ట్ర సంచిత నిధి (కన్సాలిడేటెడ్ ఫండ్ ఆఫ్ ది స్టేట్)ని అందుబాటులోకి తెస్తున్నారని జగన్ ఆరోపించారు. ఇది భారత రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 203, 204లను పూర్తిగా ఉల్లంఘించడమేనని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, రాష్ట్ర సంచిత నిధిని హామీగా చూపి ఏపీఎండీసీ రుణాలు సేకరించడానికి అనుమతించడం ఆర్టికల్ 293(1)కి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఏపీఎండీసీకి భవిష్యత్తులో వచ్చే ఆదాయం మొత్తంపైనా బాండ్ హోల్డర్లకు ప్రత్యేక హక్కు కల్పించారని, దీనికి అదనంగా సుమారు రూ. 1,91,000 కోట్ల - మిగతా3లో

## ఇజ్రాయెల్,అమెరికా విరుచుకు పడుతున్న వేళ..

## ఇరాన్‌కు ప్రధాని మోదీ ఫోన్ కాల్!



# యోగాంధ్ర గిన్నిస్ రికార్డు

- స్పందించిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు
- విశాఖ వేదికగా జరిగిన యోగాంధ్ర కార్యక్రమం గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది.
- యోగా ప్రజలను మరోసారి ఏకం చేసింది: ప్రధాని మోదీ
- రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి విజయమిది: చంద్రబాబు



**విశాఖపట్నం**

విశాఖ వేదికగా జరిగిన యోగాంధ్ర కార్యక్రమం గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది. దీనిపై ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. యోగా ప్రజలను మరోసారి ఏకం చేసిందని ప్రధాని మోదీ అన్నారు. యోగాను తమ జీవితంలో భాగం చేసుకోవాలనే ఉద్యమాన్ని బలోపేతం చేసినందుకు ఏపీ ప్రజలను అభినందించారు. విశాఖలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమం.. చాలా మందిని ఆరోగ్యంగా ఉంచేందుకు ప్రేరేపిస్తుందని అన్నారు.

రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి విజయమిది: చంద్రబాబు

ఒక లక్ష్యం కోసం ఐక్యంగా ఉన్నప్పుడు మనం ఏం సాధించగలమో తెలిపేందుకు గిన్నిస్ రికార్డు ఒక నిదర్శనమని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ యోగా డే నిర్వహణ ద్వారా ఏపీ సాధించిన ప్రపంచ రికార్డు.. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి విజయమన్నారు. ఈ అద్భుత ఘనతను - మిగతా3లో



## 'వ్యవసాయం దండగన్న చంద్రబాబు..

## రైతులకు ఏం మేలు చేస్తాడు?

- వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- చంద్రబాబు చెప్పేటివి బూటకపు మాటలు
- ఎన్నిసార్లు చంద్రబాబు సీఎం అయిన రైతులను పట్టించుకున్నది లేదు
- ప్రజలను భయభ్రాంతులకు ఈ ప్రభుత్వం గురిచేస్తోంది



## రాహుల్‌కు 'మేకిన్ ఇండియా' అంటే ఏంటో తెలియదు

- మన దేశంలో ఏం తయారవుతుందో ఒకూడా ఆయనకు తెలియదు
- యూపీఏ ప్రభుత్వ హయాంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ 11వ స్థానంలో ఉండేది
- ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చాక పదేళ్లలో దేశాన్ని ఐదో ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దారు

# 2047 నాటికి వికసిత్ భారత్ సాధించేలా మోదీ లక్ష్యం

- ప్రపంచంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందు ఉండాలి
- వాటి ద్వారా వచ్చే ఫలితాలను సమాజంలో అన్ని వర్గాల వారికి అందించడమే ప్రధాన ఉద్దేశం
- ఏపీ బీజేపీ అధ్యక్షురాలు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి



**విజయవాడ**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2047 నాటికి వికసిత్ భారత్ సాధించేలా లక్ష్యంగా పెట్టుకున్నారని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఆదివారం విజయవాడలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో దగ్గుబాటి పురందేశ్వరి, పాతూరి నాగభూషణం, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధిలో ముందు ఉండాలని, వాటి ద్వారా వచ్చే ఫలితాలను సమాజంలో అన్ని వర్గాల వారికి అందించడమే ప్రధాన ఉద్దేశమని, అందరికీ సంక్షేమం, దేశం అభివృద్ధి సాధించడమే వికసిత్ భారత్ లక్ష్యమని ఆమె అన్నారు. రైతులు, యువత, మహిళలను అభివృద్ధి పథంలో నడపాలని, యువతకు వివిధ రూపాల్లో ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారని, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి వారి కాళ్లపై వారు నిలబడేలా చేయూతను ఇస్తున్నారని పురందేశ్వరి పేర్కొన్నారు. మహిళల అభ్యున్నతి కోసం అనేక పథకాలు - మిగతా3లో




## ఇరాన్ అన్నంత పని చేసింది

- ప్రపంచ దేశాలపై ప్రభావం!
- హార్ముజ్ జలసంధి మూసివేతకు ఆ దేశ పార్లమెంట్ ఆమోద ముద్ర వేయడంతో ఇరాన్ ఈ నిర్ణయం
- అమెరికా దాడుల తర్వాత ఓపిక నశించిన ఇరాన్ ఇక హార్ముజ్ జలసంధి మూసివేతే లక్ష్యంగా పావులు



## 'వర్షాకాలంలోనూ ఏరివేస్తాం'..

- మావోయిస్టులకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హెచ్చరిక
- ఆయుధాలు వీడి, అభివృద్ధి పథంలో కలిసి రావాలని మావోయిస్టులకు పిలుపు
- "ప్రతిసారి వర్షాకాలంలో పరిస్థితులను అనుకూలంగా తీసుకుని మావోయిస్టులు విశ్రాంతి తీసుకునేవారు
- కానీ, ఈసారి వర్షాకాలంలో వారిని నిద్రపోనివ్వం.

## ఇజ్రాయెల్,అమెరికా విరుచుకు పడుతున్న వేళ..

# ఇరాన్‌కు ప్రధాని మోదీ ఫోన్ కాల్!



**ఢిల్లీ:** ఇరాన్‌పై ఇజ్రాయెల్,అమెరికా దాడులకు తెగబడుతున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇరు దేశాలు శాంతి నెలకొల్పేలా చర్చలు జరపాలంటూ భారత ప్రధాని మోదీ ఇరాన్ అధ్యక్షుడితో ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈమేరకు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో 'ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌తో నేను మాట్లాడాను. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా జరుపుతున్న దాడుల గురించి చర్చించాం. ఈ దాడులపై ఆందోళన వ్యక్తం చేశాం. ప్రాంతీయంగా శాంతి, భద్రత, స్థిరత్వాన్ని త్వరగా పునరుద్ధరించడానికి, తక్షణ ఉద్రిక్తతలను తగ్గించడం, శాంతి చర్చలు జరపాలని చెప్పినట్లు ' పేర్కొన్నారు. సుదీర్ఘకాలం నుంచి ఇరాన్‌తో పాటు ఇరాన్ మద్దతిస్తున్న హమాస్, హెజ్‌బొల్లా వంటి మిలిటెంట్లు గ్రూపులు ఇజ్రాయెల్‌పై దాడులకు తెగబడుతున్నాయి. ఈ దాడులు తన భద్రతకు ముప్పుగా భావిస్తోంది. అందుకే ఇజ్రాయెల్ హమాస్, హెజ్‌బొల్లాతో పాటు ఇరాన్‌పై దాడుల్ని తీవ్రతరం చేసింది.

**ఇరాన్‌పై అమెరికా ఎందుకు దాడులు చేస్తోంది?**

ఈ ఇరు దేశాల యుద్ధంలో ఇప్పుడు అగ్రరాజ్యం అమెరికా ప్రత్యక్షంగా రంగంలోకి దిగింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలతో అమెరికా సైన్యం శనివారం (జూన్ 21, 2025న) ఇరాన్‌లోని మూడు ప్రధాన అణు కేంద్రాలపై వైమానిక దాడులు చేసింది. ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్ అనే అణు కేంద్రాలపై %దీ%-2 స్పిరిట్ బాంబర్లతో భారీ బాంబుల వర్షం కురిపించింది. ట్రంప్ సైతం ఈ దాడి విజయవంతమైందని పేర్కొన్నారు. ఈ దాడి ద్వారా అమెరికా అధికారికంగా యుద్ధంలోకి దిగినట్టయింది. ఇరాన్ అణు ఆయుధాలు తయారు చేయకుండా అడ్డుకోవడమే ప్రధాన ఉద్దేశమని ట్రంప్ తెలిపారు. అయితే, ఈ చర్యపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఇది యుద్ధాన్ని మరింత పెంచుతుందా లేక శాంతికి దారి తీస్తుందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇది మూడో ప్రపంచ యుద్ధానికి నాంది కావొచ్చని పలువురు నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఇరాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధానికి కారణం**

ఇరాన్ ప్రధానంగా హమాస్ (పాలస్తీనా), హెజ్బొల్లా (లెబనాన్) వంటి మిలిటెంట్ గ్రూపులకు ఆర్థిక సహాయం, ఆయుధాలు, శిక్షణ అందిస్తోంది. ఈ శిక్షణను ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ)లోని ఖుద్స్ ఫోర్స్ అనే విభాగం నిర్వహిస్తోంది. హమాస్: ఇజ్రాయెల్‌పై అక్టోబర్ 7,2023న జరిగిన దాడికి ముందు, హమాస్ మిలిటెంట్లు ఇరాన్‌లో శిక్షణ పొందినట్లు ఇజ్రాయెల్ ఆరోపించింది. వీరికి డబ్బు,ఆయుధాలు,సాంకేతిక సహాయం కూడా అందించినట్లు ఆరోపించింది.

హెజ్ బొల్లా: ఇది లెబనాన్‌లో ఉన్న షియా మిలిటెంట్ గ్రూప్. దీనికి ఇరాన్ మద్దతు ఇస్తుంది. హెజ్ బొల్లాకు ఆయుధాలు, శిక్షణతో పాటు వ్యూహాత్మక సలహాలు సూచనలు ఇస్తోంది. అందకు హెజ్‌బొల్లా, హమాస్‌తో పాటు ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుల్ని తీవ్రతరం చేసింది. హెజ్‌బొల్లా,హమాస్ గ్రూపుల్ని నిర్వీర్యం చేసింది. ఆ రెండు గ్రూపులకు కీలకంగా వ్యవహరిస్తున్న టాప్ కమాండర్లను హతమార్చింది. ఇప్పుడు ఇరాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది.

# ఇరాన్ అన్నంత పని చేసింది..

**టెహ్రాన్:** గత కొన్ని రోజులు హోర్ముజ్ జలసంధిని మూసివేస్తామంటూ చెబుతూ వస్తున్న ఇరాన్.. అన్నంత పని చేసింది. హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు తాజాగా స్పష్టం చేసింది. హోర్ముజ్ జలసంధి మూసివేతకు ఆ దేశ పార్లమెంట్ ఆమోద ముద్ర వేయడంతో ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంది. అమెరికా దాడుల తర్వాత ఓపిక నశించిన ఇరాన్ ఇక హోర్ముజ్ జలసంధి మూసివేతే లక్ష్యంగా పావులు కదిపింది. దీనికనుగుణంగా పార్లమెంట్ ద్వారా ఆమోద ముద్ర వేయించుకున్న ఇరాన్.. ప్రపంచ దేశాలకు ఎంతో కీలకమైన ఆ జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యే అవకాశముంది. అయితే, ఇరాన్ నిర్ణయం ప్రపంచ ముడి చమురు ధరలలో పెరుగుదలకు దారితీయనుంది.

భారత్‌పై చమురు దిగుమతుల ప్రభావం

హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేస్తున్నట్లు ప్రకటించిన తరుణంలో చమురు, గ్యాస్ దిగుమతులపై ఆధారపడ్డ భారత్ లాంటి దేశాలపై అత్యంత ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రతి రోజు హర్మూజ్ జలసంధి ద్వారా భారత్‌కు చేరే ముడిచమురే సుమారు 15 లక్షల బ్యారెళ్లు మరి!. ఈ రవాణ ఆగిపోయిందంటే.. రోజుకు 10 నుంచి 12 కోట్ల లీటర్ల పెట్రోలు ఉత్పత్తి కాదన్నమాట. కొంచెం అటు ఇటుగా ఇది మన రోజువారీ వినియోగానికి సమానం. చమురు రవాణా నిలిచిపోవడం వల్ల డీజిల్‌తోపాటు అనేక ఇతర పదార్థాల ఉత్పత్తి కూడా నిలిచిపోతుంది. ఈ కొరతను ఎదుర్కొనేందుకు దేశాలు పోటాపోటీగా చమురు కొనుగోళ్లు మొదలుపెడతాయి. తద్వారా డిమాండ్ పెరిగి ఎక్కువ డాలర్లు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. దీంతో రూపాయి విలువ పడిపోతుంది. వస్తువుల ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణమూ అదుపులో ఉండదు. అయితే భారత్ ప్రత్యామ్నాయ మార్గాలు చేపట్టింది. అమెరికా, రష్యాల నుంచి చమురు నిల్వలు దిగుమతి పెంచేందుకు భారత్ అడుగులు వేస్తోంది. ఏది ఏమైనా ఇరాన్ నిర్ణయంతో ప్రపంచ దేశాలు చమురు కోసం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొనే అవకాశాలే ఎక్కువ.




## శాంతి నెలకొని ఒక దశాబ్దం..

# సమైక్యతా సమయం





కొలంబియా రాజధాని బొగొటాలోని ప్రఖ్యాత శాంటా మారియా ప్లాజాలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేలాది యోగ సాధకులు, ఔత్సాహికులు పాల్గొన్న ఈ వేడుకకు ప్రపంచ ప్రఖ్యాత యోగా గురువు ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ స్వయంగా హాజరయ్యారు. సరిగ్గా ఒక దశాబ్దం కిందట కొలంబియా ప్రభుత్వం, తీవ్రవాద ఫార్క్ గెరిల్లా సంఘాలు శాంతి ఒప్పందం చేసుకోవటంలో గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ అత్యంత కీలక పాత్ర పోషించిన విషయం విదితమే. ఆ విధంగా దశాబ్దాలపాటు కొనసాగిన తీవ్రవాద సాయుధ సంఘర్షణకు స్వస్తి చెప్పి పది సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ సంవత్సరపు యోగా దినోత్సవ వేడుకలు ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇది కొలంబియాలో శాంతి దశాబ్దానికి గుర్తుగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రసంగించిన గురుదేవ్, యోగాను కేవలం శారీరక వ్యాయామంగా మాత్రమే అనుకోవద్దని, అది మన మానసిక స్థితిని సైతం మార్చగలదని గుర్తు చేశారు. నేడు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందిన యోగా దినోత్సవపు కార్యాచరణను రూపొందించటం గురించి మాట్లాడుతూ, మొట్టమొదటి కామన్ యోగా ప్రోటోకాల్ ను రూపొందించిన కమిటీకి తానుఅధ్యక్షత వహించిన జ్ఞాపకాలను పంచుకున్నారు. "ప్రపంచ జనాభాలో మూడు వంతులకు పైగా ప్రజలు ఈ ప్రోటోకాల్‌ను అనుసరిస్తుండటం నాకు చాలా ఆనందంగా ఉంది. అయితే మానసిక ఆరోగ్య రంగంలో మన పని ఇక్కడితో ఆగదు. ఇది వాస్తవానికి ఆరంభం మాత్రమే." అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బొగోటా కల్చరల్ సెక్రటేరియట్‌కి చెందిన అబ్జర్వేటరీ ఆఫ్ కల్చర్ అండ్ కల్చరల్ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ, "గత కొన్ని వారాలుగా దేశంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొని ఉంది, ఆ ఉద్రిక్తతలను చల్లార్చి, సమతుల్యం తీసుకురావడానికి, బొగోటా దేశ ప్రజలందరికీ ఒక సానుకూల సందేశాన్ని ఇచ్చేందుకు ఈనాడు సరైన సమయం వచ్చింది." అని వ్యాఖ్యానించారు. 2015వ సంవత్సరంలో, కొలంబియాలో శాంతిస్థాపన ఇక అసాధ్యమని చాలామంది అనుకున్న సమయంలో దానిని గురుదేవ్ సాధించారు. దాదాపు 50 సంవత్సరాల పాటు ఫార్క్ (%ఖీూ=జ%) తిరుగుబాటుదారులు, కొలంబియా ప్రభుత్వం మధ్య జరిగిన ఉద్రిక్తతలు, ఘర్షణలు కొనసాగాయి. అనేక శాంతి ఒప్పందాలు విఫలమై, అవిశ్వాసపు అగాధం ఇరువర్గాలలో నెలకొన్న ఆ తరుణంలో గురుదేవ్ ఫార్క్ కమాండర్లతో మూడు రోజుల మధ్యవర్తిత్వ చర్చలు నిర్వహించారు. అహింసను ఆయుధంగా స్వీకరించమని, దేశ భవిష్యత్తు కోసం విస్తృత దృక్పథంతో చర్చలను అంగీకరించమని వారిని కోరారు. ఆయన చొరవతో సంక్షోభానికి పరిష్కారం లభించింది. ఒక సంవత్సరం పాటు సంపూర్ణ కాల్పుల విరమణ ను ఫార్క్ ప్రకటించింది ూ అభూతపూర్వమైన ఈ చర్య తరువాతి శాంతి ఒప్పందానికి మార్గాన్ని సిద్ధం చేసింది. పది సంవత్సరాల తరువాత, ఈరోజున గురుదేవ్ మళ్లీ కొలంబియాను సందర్శించారు. కేవలం దశాబ్ది ఉత్సవాన్ని జరుపుకోవడానికి మాత్రమే కాక, మరింత శాంతియుతంగా, ఐక్యతతో కూడిన దక్షిణ అమెరికాను సాధించే దిశగా వారు తమ దృష్టిని సారించారు. బొగోటా, మెడెలిన్, కార్టాజెనా వంటి నగరాల్లో, ఆయన కొలంబియా పార్లమెంట్ సభ్యులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలను కలుసుకుని, వారికి ధ్యానపు లోతైన అనుభూతిని పరిచయం చేశారు. కొలంబియా పార్లమెంట్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ గురుదేవ్, "కష్టాలనుండి విముక్తమైన ప్రపంచం, మరింత ప్రేమభరితమైన, ఆనందంగా, శాంతితో నిండిన ప్రపంచం అనేది ఇది ఊహా ప్రపంచంలా అనిపించవచ్చు. అది ఒక కలగానే ప్రారంభమవుతుంది. మనం ఈ కలను కనటం ప్రారంభిస్తే, దాన్ని తప్పక నిజం చేయగలమని నేను నమ్ముతున్నాను." అని అన్నారు. అంతకు ముందు జూన్ 20వ తేదీన, సమాజ నిర్మాణంలో గురుదేవ్ చూపిన శ్రద్ధ, నిబద్ధత, ఇంకా స్ఫూర్తివంతమైన, నిరంతర సేవలకు గుర్తింపుగా కార్టాజెనా డే ఇండియాస్ నగర మేయర్ డుమెక్ టుర్‌బే పాజ్ శ్రీశ్రీ ని లిబొలీవార్ గవర్నరేట్ మెడల్ తో సత్కరించి, ప్రపంచంలో శాంతి, ఆనందాలను ప్రోత్సహించడంలో గురుదేవుల పాత్రను శ్లాఘించారు. 2016లో న్యూఢిల్లీలో జరిగిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ వరల్డ్ కల్చర్ ఫెస్టివల్‌కు హాజరైన చిత్రదర్శకురాలు మరియు ఫోటోగ్రాఫర్ లికా గవీష్ తన అనుభవాన్ని పంచుకుంటూ, "నా భాగస్వామి ఒక కేమెరామన్‌గా ఘర్షణ ప్రాంతాల్లో పనిచేశాడు. అక్కడి పరిస్థితులు ఎంత కఠినంగా ఉంటాయో నాకు బాగా తెలుసు. అటువంటి ప్రాంతానికి శాంతిని తీసుకురావడంలో గురుదేవ్ పాత్ర పోషించారన్న విషయం నన్ను బాగా కదిలించింది. ప్రపంచం ఆయనకు ఎంతో ఋణపడి ఉంటుంది." అని ఉద్వేగ భరితంగా గుర్తుచేసుకున్నారు.

## 'వర్షాకాలంలోనూ ఏరివేస్తాం'



**ఇంటర్నెట్ డెస్క్:** వర్షాకాలంలోనూ మావోయిస్టు ఏరివేత ఆపరేషన్లు కొనసాగిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆయుధాలు వీడి, అభివృద్ధి పథంలో కలిసి రావాలని మావోయిస్టులకు పిలుపునిచ్చారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఛత్తీస్‌గఢ్ చేరుకున్న అమిత్ షా.. రాయ్‌పుర్ అటల్ నగర్‌లో నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ (ఎన్‌ఎఫ్ఎస్‌యూ) క్యాంపస్, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రసంగించారు. "ప్రతిసారి వర్షాకాలంలో పరిస్థితులను అనుకూలంగా తీసుకుని మావోయిస్టులు విశ్రాంతి తీసుకునేవారు. కానీ, ఈసారి వర్షాకాలంలో వారిని నిద్రపోనివ్వం. 2026 మార్చి నాటికి మావోయిస్టు రహిత భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా మరింత ముందుకెళ్తాం" అని అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టులు లొంగిపోవాలని, ఆయుధాలు వీడి.. అభివృద్ధి ప్రయాణంలో చేరాలని పిలుపునిచ్చారు. వారితో చర్చలు అవసరం లేదన్నారు. సాయుధ పోరాటాన్ని వదులుకుని జనజీవన స్రవంతిలో చేరే వారికి మరింత సాయం చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

**అమెరికా దాడులు.. ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని మోదీ ఫోన్**

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే ప్రధాని మోదీ దార్శనికత చాలా స్పష్టంగా ఉందని అమిత్ షా అన్నారు. "మా ప్రభుత్వం కేవలం ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధిపైనే దృష్టి పెట్టడం లేదు. సకాలంలో న్యాయం అందించేందుకూ చర్యలు తీసుకుంటోంది. కొత్త చట్టాలు దీనికి దోహదపడతాయి" అని తెలిపారు. ఇదిలా ఉండగా.. నక్సలిజం సమస్యపై ఛత్తీస్‌గఢ్‌తోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఝార?ండ్, ఒడిశా ఉన్నతాధికారులతో అమిత్ షా సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

## రాహుల్‌కు 'మేకిన్ ఇండియా' అంటే ఏంటో తెలియదు



**ముంబయి:** 'మేకిన్ ఇండియా' కాస్తా 'అసెంబ్లింగ్ ఇండియా'గా మారిందంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన పోస్టుపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ మండిపడ్డారు. రాహుల్‌కు మేకిన్ ఇండియా అంటే ఏమిటో తెలియదన్నారు. అంతేకాకుండా మన దేశంలో ఏం తయారవుతుందో కూడా ఆయనకు తెలియదని ఆక్షేపించారు. ముంబయిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. యూపీఏ ప్రభుత్వ హయాంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ 11వ స్థానంలో ఉండేదని, ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చాక పదేళ్లలో దేశాన్ని ఐదో ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దారని కూడా ఆయనకు తెలియకపోవచ్చని విమర్శించారు. రాబోయే రెండేళ్లలో దేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుందని తెలిపారు. రాహుల్ కొంత హోం వర్క్ చేయాలని హితవు పలికారు. ప్రధాని మోదీ నినాదాలివ్వడంలోనే ఆరితేరారని, దేశ సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. 'మేకిన్ ఇండియా' నినాదంతో మోదీ ఊదరగొడుతున్నా దేశంలో ఉత్పాదకత కనిష్ఠ స్థాయికి పడిపోయిందని, నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. 'మేకిన్ ఇండియా' కాస్తా 'అసెంబ్లింగ్ ఇన్ ఇండియా'గా మారిందని ధ్వజమెత్తారు. దిల్లీలోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ మార్కెట్ 'నెహ్రూ ప్లేస్'లో తాజాగా పర్యటించిన రాహుల్.. అక్కడ పనిచేసే టెక్నీషియన్లతో ముచ్చటించిన వీడియోను ఆయన షేర్ చేసుకున్నారు.

## 'పహల్గామ్' ఉగ్రవాదులకు ఆశ్రయం.. ఇద్దరు అరెస్ట్




న్యూఢిల్లీ: పహల్గామ్ ఉగ్రదాడిలో భాగస్వామ్యం కలిగిన ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన ఇద్దరిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ)ఆదివారం అరెస్టు చేసింది. వీరిని పహల్గామ్‌కు చెందిన పర్వైజ్ అహ్మద్ జోథర్, బషీర్ అహ్మద్ జోథర్‌లుగా గుర్తించింది. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా (ఎల్‌ఈటీ)తో సంబంధం కలిగిన ముగ్గురు సాయుధ ఉగ్రవాదులకు వీరు ఆశ్రయం కల్పించడంలో పాటు వారికి ఆహారం, ఇతర సదుపాయాలు కల్పించారని ఎన్‌ఐఏ ఒక ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఉగ్రదాడి కేసుపై ఎన్‌ఐఏ దర్యాప్తు చేస్తోంది. ఈ దాడికి ముందు హిల్ పార్క్ ప్రాంతంలోని ఈ ఉగ్రవాదులను నిందితులు దాచి ఉంచారని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. విచారణ సమయంలో పర్వైజ్, బషీర్ ఈ ఉగ్రదాడిలో పాల్గొన్నవారి గుర్తింపులను వెల్లడించారని, వారు పాకిస్తానీ జాతీయులని నిర్ధారించారని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. పర్యాటకులను వారి మతపరమైన గుర్తింపు ఆధారంగా ఉగ్రవాదులు దాడులకు పాల్పడ్డారు. ఇది ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో జరిగిన భారీ ఉగ్రదాడులలో ఒకటిగా నిలిచింది. చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం, 1967లోని సెక్షన్ 19 కింద వీరిద్దరినీ అరెస్టు చేశారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లోని బైసరన్ లోయలో పాకిస్తాన్ ఉగ్రవాదులు పర్యాటకులపై కాల్పులు జరిపి, 26 మందిని పొట్టనపెట్టుకున్నారు. ఈ దాడుల్లో16 మంది గాయపడ్డారు.

# ‘వ్యవసాయం దండగన్న చంద్రబాబు..
# రైతులకు ఏం మేలు చేస్తాడు?

**చిత్తూరు జిల్లా:** వ్యవసాయం దండగన్న చంద్రబాబు రైతులకు ఏం మేలుచేస్తాడంటూ.. వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పుంగనూరులో పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. కోట్ల రూపాయలు చిత్తూరు జిల్లాలో టమోటా రైతులు నష్టపోయారన్నారు. తోతాపురి మామిడి కాయలు కిలో 2,3 రూపాయలు ధరలు ఉంటే రైతులు ఎలా బతకాలి? చంద్రబాబు చెప్పేటివి బూటకపు మాటలు” అంటూ మండిపడ్డారు. “ఎన్నిసార్లు చంద్రబాబు సీఎం అయిన రైతులను పట్టించుకున్నది లేదు. వ్యవసాయం దండగ అని స్వయనా ఒక సీఎంగా ఉంటూ ఆయన మాట్లాడారు. ఇలాంటి ముఖ్యమంత్రి ఈ రాష్ట్రాన్ని పరిపాలిస్తుంటే రైతులకు గిట్టుబాటు ధరలు ఎక్కడ వస్తాయి?. ఇలాంటి ముఖ్యమంత్రి



ఉండడం చాలా బాధాకరం. మన రాష్ట్రంలో దాదాపు 75 శాతం రైతులు వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నారు. రైతులకు ప్రభుత్వం చేదోడు వాదోడుగా నిలవాల్సిందిపోయి అందరి రైతుల ఉసురుతీస్తున్నారు” అని పెద్దిరెడ్డి ధ్వజమెత్తారు. “రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించేందుకు వైఎస్ జగన్ వెళ్తుంటే.. వైఎస్సార్‌సీపీ నాయకులను వేధిస్తూ కేసులు పెడుతున్నారు. ప్రజలను భయబ్రాంతులకు ఈ ప్రభుత్వం గురిచేస్తోంది. మా ప్రభుత్వంలో రైతుల నుంచి టమోటా కొని రైతులను అదుకున్నాం. గతంలో రైతులు క్రాప్ హాలిడే అని పెట్టారు. ఇక నాలుగు సంవత్సరాలు రైతులు ఈ ప్రభుత్వంలో సెలవులో ఉండాల్సిందే. రైతులకు చేయూత ఇచ్చే ప్రభుత్వం కాదు ఇది. గిట్టుబాటు ధరలు లేకుండా రైతులు అవస్థలు పడుతుంటే చంద్రబాబు పట్టించుకోవడం లేదు” అని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిప్పులు చెరిగారు.

# పాపం కన్నా...

సీనియర్ నేత కన్నా లక్ష్మీనారాయణకు వచ్చే ఎన్నికలలో సత్తెనపల్లి నియోజకవర్గం సీటు దక్కుతుందా? లేదా? అన్న చర్చ జరుగుతుంది. ఇప్పటికే టీడీపీ నాయకత్వం ఆయనను దూరం పెట్టి మరీ వచ్చే ఎన్నికలకు ఆయనకు సత్తెనపల్లి నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చేందుకు కూడా సిద్ధపడకపోవచ్చంటున్నారు. అందుకు అనేక కారణాలున్నాయని చెబుతున్నారు. కన్నా లక్ష్మీనారాయణ వయసు రీత్యానే కాకుండా ఇక జనంలో పెద్దగా తిరగలేని పరిస్థితి ఉంది. ప్రస్తుతం టీడీపీలో అంతా యువత మంత్రమే ప్రధానంగా వినిపిస్తుంది. ముఖ్యంగా టీడీపీకి పట్టున్న గుంటూరు జిల్లాలో టీడీపీ హైకమాండ్ ఎవరికి టిక్కెట్ ఇచ్చినా అది నిజంగా వారికి వరంగానే చెప్పాలి. సీనియర్ నేతగా, కాపు సామాజికవర్గంగా కన్నా లక్ష్మీనారాయణకు తిరుగులేదు. ఎందుకంటే ఒకప్పుడు కాపు సామాజికవర్గానికి కన్నాయే బ్రాండ్ అంబాసిడర్. అయితే జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన తర్వాత అదికూడా పోయింది. కాపు నేత అంటే ఇప్పుడు పవన్ కల్యాణ్ మాత్రమే ఆ సామాజికవర్గానికి కనపడుతున్నారు. ఇక జిల్లా కూడా కన్నా లక్ష్మీనారాయణకు ఇబ్బంది కరంగా మారింది. కమ్మ సామాజికవర్గం నేతలు ఎక్కువగా ఉన్న ఈ జిల్లాలో ప్రధానంగా టీడీపీలో ఉంటే జిల్లా పార్టీపై కూడా పట్టు చిక్కే అవకాశం లేదు. ఎందుకంటే సీనియర్ నేతలు ఎందరో ఈ జిల్లాల్లో పసుపు పార్టీలో



ఉండటంతో పాటు వారి మాట చెల్లుబాటు అవుతుంది తప్పకన్నామాటను ఎవరూ ఖాతరు చేయరు. రాయపాటి సాంబశివరావు వంటి బలమైన నేతలనే వయసు ప్రభావంతో ఆయనను పార్టీ పక్కన పెట్టేసిన విషయాన్ని కొందరు గుర్తుచేస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన కన్నా లక్ష్మీనారాయణ తర్వాత ఆ పదవీకాలం పూర్తికావడంతో పాటు తనకు రాజకీయ పదవులు ఏవీ దక్కవన్న నిర్ణయానికి వచ్చిన కన్నా 2024 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు. అప్పటి క్యాలిక్యులేషన్స్ ప్రకారం కన్నా లక్ష్మీనారాయణకు సత్తెనపల్లి నియోజకవర్గం టిక్కెట్ ను పార్టీ ఇచ్చింది. గెలిచిన తర్వాత మంత్రి పదవి ఆశించినా, ఆయనకు దక్కకపోవడానికి అనేక కారణాలున్నాయి. సామాజికవర్గంతో పాటు జిల్లాలో అప్పటికే కీలక నేతలకు మంత్రి పదవులు దక్కడంతో కన్నా ఆశలు గల్లంతయ్యారు.... ఇకవచ్చే ఎన్నికల నాటికి కన్నా స్థానంలో కోడెల శివరాం పేరును ఖరారు చేసే అవకాశాలున్నాయని పార్టీ లో పెద్ద టాక్ నడుస్తుంది. ఎందుకంటే గుంటూరుజిల్లాలోకమ్మ సామాజికవర్గంలో కోడెల కుటుంబాన్ని రాజకీయంగా తొక్కేసిందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తుంది. కోడెల శివప్రసాద్ కు పల్నాడుజిల్లాలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఆయన చనిపోయిన తర్వాత కుటుంబాన్ని చేరదీయకపోవడంపై కమ్మ సామాజికవర్గంలో అగ్రస్థానం లో ఉన్న వారు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంతో వచ్చే ఎన్నికల్లో సత్తెనపల్లి టిక్కెట్ ను కోడెల శివరాంకు టిక్కెట్ ఇచ్చే అవకాశముందని చెబుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజన జరిగి సంఖ్య పెరిగినా కూడా టీడీపీ వచ్చే ఎన్నికల్లో యువతకే ప్రాధాన్యత ఇవ్వాలన్న లక్ష్యంతో ఉందని,అందువల్ల కన్నా లక్ష్మీనారాయణకు సత్తెనపల్లి కూడా దూరం అవుతుందన్న కామెంట్స్ బలంగా వినపడుతున్నాయి. మరి కన్నా లక్ష్మీనారాయణ రాజకీయ భవిష్యత్ ఎలా ఉంటుందన్నది చూడాలి

# ఏడాది పాలనపై కూటమి ప్రభుత్వం సమావేశం

ఏపీలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం తమ తొలి ఏడాది పాలనపై సమగ్ర సమీక్ష నిర్వహించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రేపు (జూన్ 23) అమరావతిలో కీలక సమావేశం జరగనుంది. పాలనాపరమైన అంశాలు, సాధించిన ప్రగతి, భవిష్యత్ కార్యాచరణపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. 26 జిల్లాల నుంచి హాజరయ్యే అధికారులతో సమావేశం ముగిసిన అనంతరం, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు అందరితో కలిసి అక్కడే ఏర్పాటు చేసిన విందులో పాల్గొంటారు. వాస్తవానికి, కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న జూన్ 12వ తేదీనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని తొలుత భావించారు. అయితే, అహ్మదాబాద్ సమీపంలో జరిగిన ఘోర విమాన ప్రమాదం కారణంగా ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయాల్సి వచ్చింది. ఇప్పుడు, రేపటి సమావేశంలో గత ఏడాది కాలంలో చేపట్టిన పాలనా సంస్కరణలు, తీసుకొచ్చిన మార్పులు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధికి చేసిన కృషిని ప్రభుత్వం సమగ్రంగా సమీక్షించుకోనుంది. ఈ సమావేశంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల అధిపతులు (హెచ్ఓడీలు), ప్రభుత్వ కార్యదర్శులు, మంత్రులు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు పాల్గొంటారు. తొలి ఏడాది సాధించిన ప్రగతిని వివరిస్తూ, రెండో ఏడాదిలో చేపట్టాల్సిన కార్యక్రమాలు, నిర్దేశించుకోవాల్సిన లక్ష్యాలపై ఈ భేటీలో ప్రధానంగా చర్చించనున్నారు. రాబోయే నాలుగేళ్లలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు, అభివృద్ధి లక్ష్యాలను ఎలా సాధించాలనే అంశంపై కూలంకషంగా చర్చించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎదురైన ఆర్థిక, పాలనాపరమైన సవాళ్లను అధిగమించి, రాష్ట్రాన్ని పునర్నిర్మాణ పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. స్వల్పకాలిక అభివృద్ధి లక్ష్యాలతో పాటు, ‘వికసిత ఆంధ్రప్రదేశ్’ సాధన కోసం ‘స్వర్ణాంధ్ర ఏ2047’ వంటి దీర్ఘకాలిక ప్రణాళికలను కూడా ప్రభుత్వం రూపొందించి అమలు చేస్తోంది. పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణం, రాష్ట్రానికి కొత్త పరిశ్రమలు, పెట్టుబడులను ఆకర్షించడం, 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం వంటి కీలక అంశాలపై ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

# వచ్చే ఏడాది స్థానిక సంస్థల ఎన్నికలు

-మొదటిపేజీ తరువాయి

ఉండటంతో వీటి ఫలితాలు అధికార, విపక్ష పార్టీలు రాజకీయాలపై ఒక అంచనాకు వచ్చేందుకు అవకాశముంటుంది. సహజంగానే అధికార పార్టీకి... స్థానిక సంస్థల ఎన్నికలు సహజంగా అధికార పార్టీకి అనుకూలంగా ఉంటాయి. మరో నాలుగేళ్లు అధికారంలో ఉండటంతో అధికార పార్టీ వైపు ప్రజలు కూడా మొగ్గు చూపుతారు. అధికార పార్టీకి చెందిన వారు ఎన్నికయితే తమ సమస్యలను పరిష్కరిస్తారని భావించి అటు వైపు చూస్తారు. అయితే ఏపీ రాజకీయాలను నమ్మలేం. ప్రజల్లో ఉన్న అసంతృప్తి, సంతృప్తి పాళ్లను కొలమానంగా దీనిని పరిగణనలోకి తీసుకోవడానికి కూడా వీలులేదు. వైసీపీ హయాంలో జరిగిన స్థానికసంస్థల ఎన్నికల్లో ప్రజలు వైసీపీ వైపు మొగ్గు చూపారు. దాదాపు అన్ని కార్పొరేషన్లను వైసీపీ కైవసం చేసుకుంది. మున్సిపాలిటీల్లో తాడిపత్రి మినహాయిస్తే అన్నింటిని ఫ్యాన్ పార్టీ గెలుచుకుంది. పంచాయతీలంటే వైసీపీ అనుకూలురే ఎన్నికయ్యారు... మానవతను పెంపొందించే సామూహిక ప్రక్రియ వైసీపీ, టీడీపీ నేతల ధీమా.... అయితే ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజలు అధికార పార్టీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని వైసీపీ నేతలు చెబుతున్నారు. ఈ ఫలితాలతో కూటమి ప్రభుత్వం తేలిపోవడం ఖాయమని ధీమాగా ఉన్నారు. కానీ టీడీపీ నేతల్లో ఏ మాత్రం బెరుకు, భయం లేదు. ఇప్పటికే సూపర్ సిక్స్ హామీల్లో ఎక్కువ భాగం అమలుచేయడంతో పాటు ఇంకా కొన్నింటిని అమలు చేయడానికి రెడీ అవుతుండటంతో ఎన్నికల సమయానికి తమకు గ్రౌండ్ అనుకూలంగా మారుతుందని టీడీపీ నేతలు లెక్కలు వేసుకుంటు?న్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు తమ నియోజకవర్గం, జిల్లాల పరిధిలో ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో క్లీన్ స్వీప్ చేస్తామన్న నమ్మకం పసుపు పార్టీ నేతల్లో ఉంది. అనేక అంశాలు ప్రభావితంచేసే... కానీ అనేక అంశాలు స్థానిక సంస్థల ఎన్నికల్లో పనిచేస్తాయని చెప్పక తప్పదు. ఇచ్చిన హామీలు అమలయిన వారు హ్యాపీగా ఉంటారు. అమలు కాని వారు అసంతృప్తిగా ఉంటారు. పథకాలు దక్కని వారు ఖచ్చితంగా అధికార పార్టీపై అసహనంతో ఉంటారు. దక్కిన వారు మళ్లీ అధికార పార్టీ గుర్తుపైనే ఓటేస్తారు. అయితే అధికారంలో ఉన్న పార్టీ ఏ మేరకు పథకాలను




అందించింది? ఎంత అభివృద్ధి ఆ ప్రాంతంలో ఈ ఏడాదిలో సాధించింది? అన్న దానిపైనే ఎక్కువగా స్థానికసంస్థల ఫలితాలు ఆధారపడి ఉంటాయి. మరొక వైపు అధికార పార్టీకి ఎటూ అధికారం అడ్వాంటేజీగా ఉంటుంది. అందుకే వచ్చే ఏడాది జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జనం నుంచి సౌండ్ ఎలా వస్తుందన్నది చూడాల్సి ఉంది. అయితే ఈ ఫలితాలు సాధారణ ఎన్నికలకు ప్రభావితం చేయలేవని స్పష్టంగా చెప్పొచ్చు. ఎందుకంటే నాలుగేళ్ల సమయం ఉంది కాబట్టి.

## 2047 నాటికి వికసిత్ భారత్ సాధించేలా మోదీ లక్ష్యం..

-మొదటిపేజీ తరువాయి

అమలు చేస్తున్నారన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా వ్యాపారాలు పెట్టుకునే అవకాశం కల్పించారని, డ్రోన్‌ల కొనుగోలుకు పది లక్షలు ఉంటే.. అందులో ఎనిమిది లక్షలు ప్రభుత్వం ఇస్తుందని, రెండు లక్షలతో వ్యవసాయానికి ఈ డ్రోన్‌లు వాడుకోవచ్చునని ఆమె అన్నారు.

**రైతులకు ప్రతి ఏడాది రూ. 6వేలు..**

రైతుల కోసం ప్రతియేడాది రూ. 6 వేలు కేంద్రం ఇస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం వారికి అదనంగా డబ్బులు ఇస్తోందని పురందేశ్వరి అన్నారు. ఫసల్ భీమా యోజన ద్వారా రైతులకు సహకారం అందిస్తోందని, రైతు సుభిక్షంగా ఉంటే.. దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. బీసీ కమిషన్‌కు చట్ట బద్ధత ఇచ్చి, బీసీ కులాలకు అండగా నిలిచారన్నారు. ఎస్సీ కులాల వారి సంక్షేమం కోసం అనేక పథకాలు ద్వారా సబ్సిడీ రుణాలు ఇస్తోందని, బీజేపీ అంటే ఎస్సీలకు వ్యతిరేకం అని విపక్షాలు ప్రచారం చేశాయని.. అయినా ప్రజలు మోదీ సమర్థవంతమైన పాలనను నమ్మారని అన్నారు. అంబేద్కర్‌ను గౌరవించిన ఏకైక పార్టీ, ఆయన ఆశయాలను అమలు చేసిన పార్టీ బీజేపీ మాత్రమేనని పురందేశ్వరి పేర్కొన్నారు.

**అంబేద్కర్ పేరుతో కాంగ్రెస్ రాజకీయం..**

వాజ్‌పేయి హయాంలో అంబేద్కర్‌కు భారతరత్న ఇచ్చారని, ఆయన నడయాడిన నేల, నివాసం ఉన్న ప్రదేశాలను బీజేపీ ప్రభుత్వం పంచ తీర్థాలుగా అభివృద్ధి చేసిందని పురందేశ్వరి అన్నారు. కాంగ్రెస్ అంబేద్కర్ పేరు చెప్పి రాజకీయం చేసిందని.. అంబేద్కర్ కోసం అసలు కాంగ్రెస్ నేతలు ఏం చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. జవహర్ లాల్ నెహ్రూ జమానా నుంచి కాంగ్రెస్ వాళ్లు అంబేద్కర్‌ను అవమానిస్తూనే వచ్చారని.. ‘అంబేద్కర్ రాజ్యాంగం వల్లే నేను ప్రధాని అయ్యానని’ మోదీ గర్వంగా చెప్పుకున్నారని అన్నారు. భారత రాజ్యాంగాన్ని 22 సార్లు సవరించినా.. అది ప్రజల కోసమేనని చెప్పారు. ప్రభుత్వాలను కూలదోయడానికి, వాక్ స్వాతంత్ర్యం హరించడానికి రాజ్యాంగాన్ని మార్చలేదని, ఎస్సీ మోర్చా సమావేశం ద్వారా ఈ పరిణామాలను తాము ప్రజల్లోకి తీసుకెళుతున్నామన్నారు. యోగా డే సందర్భంగా రెండు గిన్నిస్ రికార్డులు ఏపీకి దక్కడం ఆనందంగా ఉందన్నారు. 23వ తేదీన శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన దివాస్ సందర్భంగా నివాళులు అర్పిస్తామన్నారు. ఎమర్జెన్సీ దివస్‌తో పాటు, తల్లి పేరుతో ఒక మొక్కను నాటే కార్యక్రమం చేపడుతున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా దళిత సమ్మేళనాలు చేపట్టి ప్రజలకు అన్ని విషయాలు వివరిస్తామని దగ్గుబాటి పురందేశ్వరి స్పష్టం చేశారు.

## యోగాంధ్ర గిన్నిస్ రికార్డు..

-మొదటిపేజీ తరువాయి

సాధ్యం చేసిన ప్రతి ఒక్కరికీ సీఎం కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఉత్సాహం, అంకితభావం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. యోగాంధ్ర ప్రపంచరికార్డులో భాగస్వాములైన అందరినీ సీఎం అభినందించారు.

## జగన్‌పై కేసు నమోదు..

మాజీ ముఖ్యమంత్రి జగన్ పల్నాడు పర్యటన సందర్భంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగయ్య అనే వృద్ధుడి మృతికి సంబంధించిన కేసులో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో జగన్ ను నిందితుడిగా చేర్చినట్లు గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ సంచలన ప్రకటన చేశారు. ఆదివారం రాత్రి గుంటూరులోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ కేసుకు సంబంధించిన కీలక వివరాలను తెలిపారు. ఈ నెల 18వ తేదీన మాజీ ముఖ్యమంత్రి జగన్ పల్నాడు పర్యటన సందర్భంగా గుంటూరులోని ఏటుకూరు రోడ్డు బైపాస్ వద్ద ఈ దురదృష్టకర సంఘటన జరిగిందని ఎస్పీ వివరించారు. రోడ్డు పక్కన తీవ్ర గాయాలతో పడి ఉన్న సింగయ్య అనే వృద్ధుడిని గుర్తించి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారని తెలిపారు. వెంగళాయపాలెం గ్రామానికి చెందిన సింగయ్య మృతిపై ఆయన భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొదట కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనంతరం, ఈ ఘటనపై లోతుగా దర్యాప్తు చేపట్టామని, ఇందులో భాగంగా సీసీటీవీ ఫుటేజ్‌లు, డ్రోన్ కెమెరా దృశ్యాలు, ఘటనా స్థలంలో ఉన్నవారు తీసిన వీడియోలను క్షుణ్ణంగా పరిశీలించామని ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. “లభించిన ఒక వీడియోలో... మృతుడు సింగయ్య మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్రయాణిస్తున్న ఫార్చ్యూనర్ వాహనం కింద పడిపోవడం, వాహనం టైరు ఆయనపై నుంచి వెళ్లినట్లు స్పష్టంగా ఉంది” అని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కీలక ఆధారాల నేపథ్యంలో, తాము కేసు సెక్షన్లను మార్చి, భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 105 (నిర్లక్ష్యం కారణంగా మరణానికి కారణమవడం), సెక్షన్ 49 కింద కేసు నమోదు చేశామని వివరించారు. ఈ కేసులో వాహనం నడిపిన డ్రైవర్ రమణారెడ్డి, మాజీ ముఖ్యమంత్రి జగన్, అలాగే కాన్వాయ్‌లో ఉన్నట్లుగా భావిస్తున్న నాగేశ్వర్ రెడ్డి, సుబ్బారెడ్డి, మాజీ మంత్రులు పేర్ని నాని, విడదల రజనిలను కూడా నిందితుల జాబితాలో చేర్చినట్లు ఎస్పీ తెలిపారు. “జగన్‌కు 14 వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చాం. కానీ, తాడేపల్లి నుంచి కాన్వాయ్ ప్రారంభమైనప్పుడు దాదాపు 50 వాహనాలతో పర్యటన సాగింది. లభించిన ఆధారాల మేరకు దర్యాప్తు కొనసాగిస్తున్నాం. చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటాం” అని సతీష్ కుమార్ స్పష్టం చేశారు. జూన్ 18న సత్తెనపల్లిలో ఒక విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని, ప్రమాదం జరిగిన రోజు అప్పటికి అందుబాటులో ఉన్న సమాచారం మేరకే ఆరోజు వేరే ప్రైవేట్ వాహనం కింద సింగయ్య పడిపోయాడని చెప్పామని, అయితే లోతైన దర్యాప్తులో మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని ఎస్పీ పేర్కొన్నారు. దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని, చట్టప్రకారంగానే కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి, తుది నిర్ణయానికి వస్తామని ఆయన మీడియాకు వివరించారు.

## కూటమి ప్రభుత్వం మరోసారి రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోంది

-మొదటిపేజీ తరువాయి

విలువైన ప్రభుత్వ ఖనిజ సంపదను కూడా ఎన్సీడీ బాండ్ హోల్డర్లకు తాకట్టు పెడుతున్నారని జగన్ ఆరోపించారు. ఇది రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనని ఆయన తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో కేసు విచారణలో ఉందని, దీనిని విచారణకు స్వీకరించిన న్యాయస్థానం ప్రతివాదులందరికీ కౌంటర్లు దాఖలు చేయాలని నోటీసులు కూడా జారీ చేసిందని జగన్ గుర్తు చేశారు. విషయం న్యాయస్థానం పరిధిలో ఉన్నప్పుడు, ప్రభుత్వం ఏపీఎండీసీని బాండ్ల జారీకి అనుమతించడం ఎంతమాత్రం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. “రాష్ట్ర భవిష్యత్తును, భారత రాజ్యాంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తూ ప్రభుత్వం వ్యవహరించడం తీవ్ర విచారకరం” అంటూ వైసీపీ అధినేత జగన్ తన ఆవేదన వ్యక్తం చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

## పేరంట్స్‌ను వదిలేసిన వారికి బుద్ధిచెప్పిన ఆర్డీఓ

**కడప :** ఆస్తులు చేతికి వచ్చే వరకు అమ్మానాన్న ఆస్తులు చేతికి వచ్చిన తర్వాత మూసలోళు చేతకాని వాళ్లు అయిపోతున్నారు. వృద్ధాప్యంలో వారిని సరిగా చూసుకోవాల్సిన బిడ్డలు పట్టించుకోని ఘటనలు చాలా చూశాం. అలాంటి బిడ్డలకు గట్టిగా బుద్ధి చెప్పారు జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ. ఆస్తులు ఉన్నా లేకపోయినా కన్నవాళ్లను చూసుకోవడం పిల్లల బాధ్యత అని చెప్పుకొచ్చారామె. ప్రొద్దుటూరురుకు చెందిన మాలేపాటి మోహన్మురావు, గౌరమ్మ దంపతులు ఏదో చిన్న వ్యాపారం చేసి డబ్బులు కూడబెట్టారు. ఐదుగురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేశారు. వయోభారంతో వ్యాపారం సాగడం లేదు. దీంతో దాన్ని ఆపేశారు. తమను సాకుతారన్న ఆశతో రంగయ్యగారి సత్రంవీధిలో ఉన్న ఇంటిని ఏడాది క్రితం పిల్లలకు రాసి ఇచ్చేశారు. ఈ మేరకు గిఫ్ట్ డీడ్ రాసి ఉంచారు. ఆస్తి తమ చేతికి రావడంతో కుమార్తెలు తమ నిజస్వరూపం చూపించారు. తమ పేరు మీద ఆస్తి వచ్చేసరికి తల్లిదండ్రులను పట్టించుకోవడం మానేశారు. తిండి కూడా పెట్టడం లేదు. వాళ్ల అనారోగ్య సమస్యలకు మందులు కూడా ఇవ్వకుండా హింసించారు. వేరే గత్యంతరం లేకపోవడంతో ఆ ముసలిదంపతులు స్వచ్ఛంద సంస్థలు, ఇరుగుపొరుగువారి సహాయంపై ఆధారపడ్డారు. వాళ్లు వేస్తే తినడం లేదంటే పస్తులు ఉంటున్నారు.

# మాటల మాంత్రికుడు పాత్రో



తెలుగు చిత్ర సీమ లో చెరగని సంతకం గణేష్ పాత్రో. సిని మాలను బట్టి, పాత్రలకు సమయోచితంగా, సందర్భాను సారంగా మాటలు రాయడంలో ఆయనకు ఆయనే సాటి. దర్శకుడి ఆలోచనలను అర్థం చేసుకుని, అందుకు అను గుణంగా సంభాషణలు రాయడం అన్నది మామూలు విషయం కాదు. అంత సులువు కానే కాదు. దర్శకుని మనోభావాలు ప్రతిబింబించేలా రచయిత సంభాషణలు రాస్తేనే సదరు సినిమా ప్రేక్షకుల ఆదరాన్ని చూర గొంటున్న దన్న మాట యదార్థం. కొందరు దర్శకులకు, కొందరు రచయితలతో కలిసి పనిచేయడం చాలా అనుకూలంగా ఉంటుంది. బహుశా, ఈ కారణంగానే చాలామంది రచయితలకు ఎక్కువ మంది దర్శకులతో పనిచేసే అవకాశం దొరకదు. కానీ, గణేష్ పాత్రోకు తన సినీ రంగ కలిసి చేసిన ప్రయాణంలో దర్శకులందరూ వైవిధ్యాన్ని కోరుకునే వారే. వెండితెర మీద తమదైన ముద్ర వేదుకున్న వారే. బాల చందర్ తో పాటు, సింగీతం శ్రీనివాసరావు, క్రాంతికుమార్ వంశీ, కోడి రామకృష్ణ, ఇంకా నేటితరం దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల ఎవరి శైలి వాళ్ళది. తెలుగు వెండితెరపై ఎవరి ప్రత్యేకత వారిది. వారు కోరుకున్న విధంగా, వారి అభిరుచులకు అనుగుణంగా సంభాషణలు రాసి మెప్పించిన ఘనత మాత్రం గణేష్ పాత్రోదే. గణేష్ పాత్రో కథలు, నాటికలు సమకాలీన పరిస్థితులకి, మధ్య తరగతి కుటుంబాలలోని మనుషుల అంతరంగాలు, సంఘర్షణలకు ప్రతి బింబాలుగా నిలుస్తాయి. అందుకే దర్శకులు నిర్మాతలు ఆయన రచనలు ఇష్ట పడ్డారు. ప్రేక్షకులు ఆదరించారు. గణేష్ పాత్రో పేరు చెప్పగానే వెంటనే గుర్తుకు వచ్చే మరో పేరు కె. బాలచందర్. పందొమ్మిది వందల డెబ్భై, ఎనభై దశకాల్లో తెలుగు తెరమీద బాలచందర్, పాత్రో కాంబినేషన్ విజయాల పరంపర కొనసాగించు కుంది. బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన ప్రతి చిత్రానికి తెలుగులో గణేష్‌పాత్రోనే సంభాషణలు రాశారు. బాల చందర్ తమిళ ఆలోచనలకు అచ్చ తెలుగు మాటలను అద్దిన రచయిత గణేష్ పాత్రో. అందుకే కాబోలు బాలు, స్వప్న, జానీ, సుహాసిని, బుచ్చిబాబు, విద్య, బేబీ.. ఈ పాత్రలేవీ కూడా పరభాషా దర్శకుడు సృష్టించినవన్న భావన కలగదు. సినిమాకు స్థానికత అద్దడంలో సంభాషణలది కీలక పాత్ర. బాలచందర్ దర్శకత్వం వహించిన మరో చరిత్ర, గుప్పెడు మనసు, ఆకలి రాజ్యం, రుద్ర వీణ, ఇది కథకాదు లాంటి పలు చిత్రాలు గణేష్ పాత్రోకు మంచి పేరు తెచ్చి పెట్టాయి. దర్శకుడు కే.బాల చందర్‌తో గణేష్‌పాత్రో అనుబంధం విడదీయ రానిది. అందుకేనేమో బాలచందర్ మరణించిన రెండు వారాలకు గణేష్ పాత్రో ఆయనను అనుసరించి వెళ్లడం గమనార్హం. సీనియర్ దర్శకుడు కోడి రామకృష్ణ, గణేష్ పాత్రోల కలయికలో 40 చిత్రాలు తెరకెక్కడం విశేషం. ముఖ్యంగా భార్గవ ఆర్ట్స్ పిక్చర్స్ అధినేత దివంగత ఎస్ గోపాల్ రెడ్డికి ఆస్థాన రచయితగా గణేష్ పాత్రో వ్యవహరించారు. అలాగే, ప్రముఖ దర్శకుడు క్రాంతి కుమార్‌తో కలసి పలు చిత్రాలకు పనిచేశారు. గణేష్‌పాత్రో స్వాతి చిత్రానికి 1983లో, రుద్రవీణ చిత్రానికి గాను 1988లో ఉత్తమ నంది అవార్డులను అందుకున్నారు. మయూరి చిత్రానికి గాను ఉత్తమ స్క్రీన్ ప్లే రచయితగా నంది అవార్డును దక్కించు కున్నారు. 2009లో ఆయన అభిమానంగా ప్రేమించే అక్కినేని నాగేశ్వరరావు పురస్కారాన్ని, 2013లో మనసు కవి ఆత్రేయ బిరుదును అందుకున్నారు. గణేష్ పాత్రో విజయ నగరం జిల్లా పార్వతీ పురంలో 1945 జూన్ 22న ఆది లక్ష్మీనారాయణ పాత్రో, సూర్యకాంతం దంపతులకు జన్మించారు. గణేష్ పాత్రో తండ్రి, పార్వతీపురం దగ్గర ఒక చిన్న గ్రామానికి కరణంగా పనిచేసేవారు. గణేష్ ప్రాథమిక విద్య అక్కడే సాగింది. పార్వతీ పురంలో ఉన్నత చదువులు చదువుతూ, నాటకాలలో నటించడం ప్రారంభించారు. పాఠశాల పుస్తకాలతో పాటు సాహిత్యాన్ని కూడా చదవటం ప్రారంభించారు. పీ.యూ.సి పూర్తయిన తర్వాత పై చదువులకు ఆంధ్ర విశ్వ విద్యాలయంలో చేరారు. అక్కడ విశ్వ విద్యాలయ సాంస్కృతిక సంఘానికి జాయింట్ సెక్రటరీగా నాటకాలు వ్రాయటం, వాటిని రంగస్థలంపై ప్రదర్శించడం ప్రారంభించారు. చిన్నప్పటి నుంచే నాటకాలు రాయడం, నటనపై గణేశ్ పాత్రో ఆసక్తి పెంచుకున్నారు. 'పావలా', 'కొడుకు పుట్టాల', 'ఆలోచించండి' వంటి పలు నాటకాలతో రచయితగా ప్రాచుర్యం పొందారు. ఇందులో 'కొడుకు పుట్టాల' నాటకానికి అంతర్జాతీయ పురస్కారం లభించింది. ఈ నాటకం పలు భాషల్లో అనువాదం కావడంతో పాటు ఆకాశవాణి, దూరదర్శన్ లలో ప్రసారమై, పాత్రో కు గుర్తింపు తెచ్చాయి. 1970 ప్రాంతంలో రచన ప్రారంభించిన గణేష్ పాత్రో అయిదేళ్ళ కాలంలో ప్రథమ శ్రేణి నాటక కర్తగా పేరు తెచ్చుకున్నారు. రచనలు చాలా తక్కువే అయినా, వ్రాసిన ప్రతి నాటిక, నాటకము రంగస్థలం మీద రక్తి కట్టి రసజ్ఞుల మెప్పు పొందింది. కథా వస్తువును పరి గ్రహించడంలో, కథనంలో, పాత్ర చిత్రణలో, సన్నివేశాల మేళవింపులో, మాటల కూర్పులో నిత్య నూతన పరిమళాన్ని వెదజల్లిన ప్రతిభాశాలి గణేష్ పాత్రో. సంఘటనల ద్వారా సమస్యను శక్తివంతంగా ఆవిష్కరించటం అయన రచనా విధానంలో ప్రత్యేకత. మృత్యుం జయుడు, తెరచి రాజు, తరంగాలు, అసుర సంధ్య నాటకాలూ, కొడుకు పుట్టాల, పావలా, లాభం, త్రివేణి, ఆగండి! కొంచెం ఆలోచించండి మొదలైన నాటికలు తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని దోచుకున్న ఉత్తమ రచనలు. 1970 నుండి 1990ల వరకు అనేక సినిమాలకు సంభాషణలు, కథను సమ కూర్చారు. 125కు పైగా చిత్రాలకు కథలు, మాటలను అందించారు. పదిహేనేళ్ళ విరామానంతరం సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు సినిమాకు సంభాషణలు సమకూర్చారు. "హలో గురూ ప్రేమ కోసమేరా ఈ జీవితం"... నిర్ణయం సినిమాలో పాట రాశారు. అదే ఆయన సంభాషణలు రాసిన చివరి చిత్రం. ఆయన సినీ సంభాషణలు సమకూర్చిన చిత్రాల్లో సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, నిర్ణయం, సీతారామయ్య గారి మనవరాలు, రుద్రవీణ, తలంబ్రాలు, ప్రేమించు పెళ్ళాడు, మయూరి, మనిషికో చరిత్ర, గుప్పెడు మనసు, ఇది కథ కాదు, మాపల్లెలో గోపాలుడు ఇలా పలు హిట్ చిత్రాలు ఉన్నాయి.

# ఎరువుల వాడకంతో ఆరుద్రపురుగు కనుమరుగు



దేవతలకు, వరుణ దేవుడికి ప్రతిరూపంగా, తమకు శుభ సూచకంగా రైతులు భావించే, ఆరుద్ర పురుగులు క్రమేపీ కనుమరుగు అవుతున్నాయి.. ఆరుద్ర నక్షత్రములలో ఆరవది. రాశి చక్రములలో, "ఆరుద్ర" నక్షత్రం యొక్క నాలుగు పాదములు, "మిధున (జెమిని) రాశికి చెందుతాయి. వ్యవసాయ పనులు ప్రారంభించ దానికి, "ఆరుద్ర కార్తె" అనుకూలమైనది. ఈ కార్తెలో మాత్రమే కనబడేది ఆరుద్ర పురుగు. ఇది మొఖమల్ బట్టను చుట్టుకున్నట్లుగా ఉండి, ఎర్రగా బుర్రగా, బొద్దుగా ఉంటుంది. అందంగా ఉండే ఈ పురుగు పంటలకు ఎలాంటి హానీ చేయదు. ఏడాదికి ఒకసారి మాత్రమే ప్రత్యక్షమౌతుంది. "ఇట్టే వచ్చి, అట్టే మాయమౌతావు, ఆరుద్ర పురుగుకు మల్లే." అని తెలుగు నాట, ఒక జాతీయము మిగుల ప్రాచుర్యములో ఉంది. ఆరుద్ర పురుగును కొన్ని చోట్ల "పట్టు పురుగు" అనీ, "చందమామ పురుగు " అనీ, "లేడీ బర్డ్" అనీ, "ఇంద్రగోప పురుగు" అని కూడా అంటారు. ఇలా చాలా పేర్లను కలిగి ఉన్న ఈ పురుగు చూడటానికి అరంగుళం సైజులో ఉండి, ఎర్రని మఖ్మల్ బట్టతో చేసిన బొమ్మలాంటి పురుగులా ఉంటుంది. ముట్టుకుంటేనే – అత్తిపత్తి చెట్టు ఆకుల్లా ముడుచుకు పోయే స్వభావం ఉన్న ఈ పురుగులు నేలమీద, కొన్నిచోట్ల ఇసుక నేలల్లో, పచ్చగడ్డి కాసింత ఉన్న చోట్లలో, విరివిగా కనిపిస్తాయి. ఈ అందమైన, మెత్తనైన పురుగులు వర్షాకాలం తొలకరి వర్షాలు కురవగానే, బిల బిల మంటూ కుప్పలు కుప్పలుగా కనిపిస్తాయి. బీడువారిన నేలపై తొలకరి జల్లులు పడగానే, బిలబిలమంటూ ఆరుద్ర పురుగులు నేలపైకి వస్తాయి. అలా ఆరుద్ర పురుగులు నేలపై కనిపిస్తే ఆ సంవత్సరం వర్షాలు ఎక్కువగా కురుస్తాయనీ, రైతన్నలు వ్యవసాయం చేసుకోవచ్చని అంటారు. ఆరుద్ర పురుగులకు రైతులకు అవినాభావ సంబంధం ఉంది. వీటిని ఏ రైతు చంపడు, ఎవ్వరినీ చంపనీయడు... వ్యవసాయ పనులు మొదలు పెట్టేందుకు ఆరుద్ర కార్తె అనుకూలమైంది. ఈ కార్తెలో మాత్రమే కనబడే అరుదైన పురుగు ఆరుద్ర. అందుకే దాన్ని "ఆరుద్ర పురుగు " అంటారు. ఇవి ప్రకృతి నేస్తాలు. చూడ ముచ్చటగా ఉండే ఆరుద్ర పురుగు ఆగమనాన్ని రైతులు "శుభసూచకం"గా భావిస్తారు. ఇక వ్యవసాయం పనులు మొదటు పెట్టుకోవచ్చని ఆనందంగా పొలాలకేసి మళ్లుతారు. గ్రామాల్లో ఈ పురుగులు కనిపించాయంటే రైతులు సంతోషంతో గంతులేస్తారు. ఆరుద్ర పురుగుల దర్శనంతో, ఆ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు పడుతాయని సంకేతం. చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండుతాయనే ధీమా రైతుల్లో నెలకొంటుంది. ఇసుక నేలల్లో, బొరియలు చేసుకుంటూ, అందులోనే జీవిస్తూ, తొలకరి వర్షాలకి బయటకి వస్తాయి. ఇవి నేలలోని సూక్ష్మ క్రిముల్ని పట్టి తింటూ, రైతులకి మేలు చేస్తాయి. ఇవి అలా బయటకి వచ్చినప్పుడు వర్షానికి. తడిసిన నల్లని భూమి మీద, ఆకుపచ్చని గీతల్లాంటి గడ్డి మీద ఎర్రని చుక్కలు అద్దినట్లుగా కనిపిస్తాయి. ఆ దృశ్యం ఎంతో హృద్యముగా ఉంటుంది. ఇవి మృదువుగా వుండి ముట్టుకుంటే వెల్వెట్ వస్త్రంలా మెత్తగా అనిపిస్తాయి. చూడగానే పట్టుకోవాలని అనిపించెంతగా, ముద్దుగా అందంగా కదిలే బొమ్మల్లా ఉంటాయి. పురుగులంటే భయపడే చిన్న పిల్లలు సైతం ఈ ఆరుద్ర పురుగుల్ని పట్టుకుంటారు. ముట్టుకుంటే చాలు అవి ముడుచు కుంటాయి. కొంత సేపటికి, ఏ కదలికా లేకుండా ఉంటే మెల్లగా నడవడం మొదలు పెడతాయి. అయితే ఆరుద్ర పురుగులు నెమ్మదిగా అంతరించే దశకు చేరుకుంటున్నాయి. పొలాల్లో మితిమీరిన క్రిమిసంహారక మందులు వాడకం దీనికి ముఖ్య కారణం. ఈమధ్య కాలంలో మరో ప్రమాదకరమైన ధోరణి ఛత్తీస్ గడ్ మరియు తెలుగు రాష్ట్రాల్లో చోటు చేసుకుంటున్నది. ఈ పురుగుల్ని కిలోల లెక్కన కొనే ఏజెంట్లు బయలు దేరారు. వీటి నుంచి సేకరించే నూనెను పక్షవాతం రోగులకు వాడే తైలం లోనూ, లైంగిక సామర్థ్యాన్ని పెంచే ఆయుర్వేద మందుల తయారీలోనూ వాడుతున్నారని చెపుతారు. అరబ్ దేశాలలో కూడా ఈ పురుగుల్ని వాడుతారు. మనిషి వెదజల్లుతున్న కాలుష్యం, పురుగుల మందుల వల్ల – ఊరపిచ్చుకల, మరికొన్ని జీవాల వలే, ఇవి కూడా కనిపించకుండా పోయే పరిస్థితులు నెలకొన్నాయి.

## వెల్దుర్తి. క్రిష్ణగిరి. మండల మహాసభలను జయప్రదం చేయండి





( ప్రజా జ్యోతి రిపోర్టర్ ) 22-06-2025. వెల్దుర్తి మండలం లో స్థానిక సిపిఐ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నబిరసులు ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి కటారి కొండ సర్పంచ్ లెనిన్ బాబు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెల్దుర్తి మండలం లోని క్రిష్ణగిరి. వెల్దుర్తి పట్టణ మహాసభను జులై 3వ తేదీన మహాసభలను జయప్రదం చేయాలని అదేవిధంగా కర్నూలు జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని పెండింగ్లో ఉన్న సాగునీరు త్రాగునీరు ప్రాజెక్టులను పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం అధికారం లేక వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలను గాలికి వదిలేసిందని తక్షణమే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని లేకపోతే ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని వారు హెచ్చరించారు మండలంలో డ్రైనేజీ కాలువలు. త్రాగునీరు ఇంటి స్థలాలపై. సీసీ రోడ్ల. సమస్యలపై మండలాల్లో ఎదుర్కొన్నటువంటి ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలకు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు క్రిష్ణగిరి వెల్దుర్తి మండలాల మహాసభలను ప్రతి కార్యకర్త నాయకులు అందరూ జయప్రదం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి టి కృష్ణ క్రిష్ణగిరి మండల కార్యదర్శి ఖలీల్ బాషా సహాయ కార్యదర్శి బంతిరాల సర్పంచ్ రవి మోహన్ ఆటో యూనిట్ జిల్లా నాయకులు ఏసన్న. ఏఐటియుసి మండల అధ్యక్షుడు మాధవ్ స్వామి పట్టణ కార్యదర్శులు గిరిబాబు చిన్నమాదులు సహాయ కార్యదర్శి డి రాజు ఆటో యూనియన్ నాయకులు కోకిల రాజు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జి.నాగమద్ది.రామాంజనేయులు జి.చిన్నమాదులు.చిన్నవ్యాపారస్తుల కార్యదర్శి అనిల్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటేశ్వర్లు రాముడు సిపిఐ నాయకులు శివ క్రిష్ణగిరి మండల నాయకులు పరమేశ్వర్ రెడ్డి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు

## మరో గ్రంథాలయ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు తెలిపిన నిత్య సాహితీ కృషివలుడు

**రచయిత , జర్నలిస్టు యక్కలూరి శ్రీరాములు**



**( ప్రజా జ్యోతి రిపోర్టర్ ) 22-06-2025. వెల్దుర్తి** సెల్ఫోన్ తో పాటు అనేక వ్యసనాల ఊబిలో మునిగి పోతున్న నేటి యువతరం, మరియూ బాల, బాలికలను మంచి సాహిత్య పుస్తకాలు,క్రీడలతో నే కాపాడుకోగలమని అందువలన అందరూ మంచి పుస్తకాలు, క్రీడలు పిల్లలకు చిన్నప్పటి నుంచే అందుబాటులోకి తీసుకురావాలని ఎన్నో మహెూన్నత రచనలు తెలుగు సాహిత్యానికి అందించి ఉభయ తెలుగు రాష్ట్రల్లో ఎంతో సాహితి కృషి చేసిన, చేస్తున్న,రచయిత, జర్నలిస్టు యక్కలూరి శ్రీరాములు అన్నారు. అనంతపురం జిల్లాలో మరో గ్రంథాలయ ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలని రచయితలు మేధావులు గ్రంథాలయాలను అభివృద్ధి చేయడంలో మరింత ముందుకు రావాలని కోరారు. ముఖ్యంగా అధికారులు, నాయకులు వసతి గృహాల్లో గ్రంథాలయాలు స్థాపించడానికి కృషి చేయాలని కోరారు. మరో గ్రంథాలయ ఉద్యమ నిర్మాత మంచి కంటి వెంకటేశ్వరరెడ్డి మరియూ కృషి చేస్తున్న రచయితలు మేధావులందరిని ఆయన అభినందించారు ముఖ్యంగా ప్రభుత్వ వసతి గృహాల్లో గ్రంథాలయాలు స్థాపించడానికి కృషి చేస్తున్న హరి సింహ నాయుడు, వైద్యం రామానాయుడును అభినందించి తాను రచించిన పుస్తకాలు కొన్ని బహుమతిగా ఇచ్చారు. మరో గ్రంథాలయ పుస్తకాన్ని కరపత్రాలను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో రచయిత,జర్నలిస్టు యక్కలూరి శ్రీరాములు హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షులు హరి సింహనాయుడు, వైద్యం రామానాయుడు, వెంగళ్ రెడ్డి,మధు, అఖిల తదితరులు పాల్గొన్నారు.

# యోగా విరామ బటన్

ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖ నగరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో లక్షలాది మంది పాల్గొన్నారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా విచ్చేసి.. యోగాంధ్రలో పాల్గొన్నారు. యోగా కేవలం వ్యక్తిగత సాధన మాత్రమే కాకుండా, ప్రపంచ భాగస్వామ్యానికి మాధ్యమంగా మారాలని, ప్రతి దేశం, సమాజం యోగాను తమ జీవన విధానంలో, ప్రభుత్వ విధానంలో భాగంగా చేసుకోవాలని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ఆయన, యోగా కేవలం వ్యాయామం కాదని, అదొక జీవన విధానమని అన్నారు. "యోగా అంటే సరళంగా చెప్పాలంటే కలపడం. ఇది ప్రపంచాన్ని కలిపింది" అని ఆయన తెలిపారుయోగా ప్రపంచాన్ని కలిపింది. 175 దేశాల్లో యోగా చేయడం సాధారణ విషయం కాదు. ఇది మనతోనే సాధ్యమైంది. ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది జీవనశైలిని యోగా మార్చింది. నేవీకి చెందిన నౌకల్లో యోగాసనాలు వేస్తున్నారు. యోగా అందరి కోసం. ప్రగతి, ప్రకృతి సంగమస్థలి విశాఖ నగరం. చంద్రబాబు, పవన్, లోకేష్‌కు అభినందనలు. వన్ ఎర్త్.. వన్ హెల్త్ థీమ్‌తో ఈ సారి యోగా

# హరిజన గోపాలపురం లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన డా"రేగేటి షణ్ముఖరావు.

### పేదల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరం..





**పాతపట్నం జూన్ 22,ప్రజా జ్యోతి న్యూస్** గ్రామీణ ప్రాంతాల పేదల ఆరోగ్యం కోసమే ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు పాతపట్నం సీనియర్ నాయకులు రేగేటి? షణ్ముఖరావు అన్నారు .పాతపట్నం మేజర్ పంచాయతీలో గల హరిజన గోపాలపురం గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల గ్రామీణ ప్రజలు నిర్లక్ష్యం, అజాగ్రత్తగా వ్యవహరిస్తారని, వారికి అవగాహన కల్పించేందుకు తరచూ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిబిరంలో పాల్గొన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు .ఈ వైద్య శిబిరంలో ముఖ్యఅతిథిగా డాక్టర్ గణపతి సదా శివం పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేగేటి షణ్ముఖరావు ఇలాంటి ఉచిత శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య పరంగా తిరుగులేని సేవలు అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు విశ్రాంతి ఎస్.ఐ కంబాల శివాజీ రెడ్డి,సింగుపురం మురళి,మంగి రామారావు,సీనియర్ జర్నలిస్టులు గోపాల్ స్వామి,కోట్ని శ్రీనివాసరావు, యాడ్ల గోవిందరావు,పల్లి కుర్మారావు,అంధవరపు సంతు,శాసనపురి శ్రీను,జానం కేశవరావు ,గౌరీ శంకర్ తో పాటు పలువురు ముఖ్య నాయకులు, విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు.

# బహుముఖ వ్యూహంతో గంజాయి అక్రమ రవాణను నియంత్రిస్తున్న జిల్లా పోలీసులు..

### విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపీఎస్.



**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** బహుముఖ వ్యూహాలు అమలుతో గంజాయి నియంత్రణలో సత్ఫలితాలిస్తున్నాయన్న జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్. 2024 సం.లో గంజాయి అక్రమ రవాణదారులపై 83 కేసులు నమోదు చేసి, 2,157 కిలోల గంజాయి, 30వాహనాలను సీజ్ చేసి, 268మంది నిందితులను అరెస్టు చేసినట్లుగా తెలిపిన జిల్లా ఎస్పీ. 2025 సం.లో ఇప్పటి వరకు 52 కేసులు నమోదు చేసి, 346 కిలోల గంజాయి, 21 వాహనాలను సీజ్ చేసి,155 మందిని అరెస్టు చేసినట్లుగా తెలిపిన జిల్లా ఎస్పీ. విజయనగరం జిల్లాలో గంజాయి అక్రమ రవాణ, విక్రయాలు, వినియోగంను నియంత్రించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం చెక్ పోస్టులు ఏర్పాటు, డైనమిక్ వాహన తనిఖీలు చేపట్టడం, అక్రమ రవాణకు బాధ్యులైన ప్రధాననిందితులను గుర్తించి, వారిని కేసుల్లో నిందితులుగా చేర్చడం, గంజాయి వ్యాపారాలతో కూడబెట్టిన అక్రమ ఆస్తులను సీజ్ చేయడం, వారిపై హిస్టరీ షీట్లు ప్రారంభించి నిఘా పెట్టడం, గంజాయి వినియోగం వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి, వారిని చైతన్యపర్చడం వంటి బహుముఖ వ్యూహాలను అమలు చేస్తూ, గంజాయిని కట్టడి చేస్తుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జూన్ 22న తెలిపారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ మాట్లాడుతూ – జిల్లాలో గంజాయి అక్రమ రవాణ, విక్రయాలు, వినియోగంను నియంత్రించేందుకు బహుముఖ వ్యూహాలను అమలు చేసి, సత్ఫలితాలు సాధించామన్నారు. అక్రమ రవాణను నియంత్రించేందుకు ప్రధాన మార్గాలను గుర్తించి, ఆయా మార్గాల్లో నాలుగు చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, నిరంతరం వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. అంతేకాకుండా, ప్రతీ రోజూ ఆయా మార్గాల్లో ఆకస్మికంగా 10 చోట్ల డైనమిక్ వాహన తనిఖీలు చేపడుతున్నామన్నారు. గంజాయి అక్రమ రవాణ చేస్తూ పట్టుబడిన నిందితులను అరెస్టు చేయడమే కాకుండా, అందుకు బాధ్యులైన ప్రధాన వ్యక్తులను కూడా నిందితులుగా చేర్చి, వారిని అరెస్టు చేస్తున్నామన్నారు. గంజాయి వ్యాపారాలు సాగించే వ్యక్తులను గుర్తించి, వారిపై హిస్టరీ షీట్లు తెరిచి, వారి కదలికలపై నిఘా పెడుతున్నామన్నారు. గంజాయి అక్రమ రవాణ, విక్రయాలను ప్రధాన వ్యాపారాలుగు సాగించే వ్యక్తులు కూడబెట్టిన అక్రమ ఆస్తులను గుర్తించి, వాటిని అటాచ్ చేస్తున్నామన్నారు. గంజాయి వినియోగం వలన కలిగే అనర్థాలను విద్యార్థులు, యువత, ప్రజలకు 'సంకల్పం' కార్యక్రమాలతోను, ప్రచార రథంతో విస్తృతంగా ప్రచారం చేస్తూ, ప్రజల్లో చైతన్యం నింపుతున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. గత సంవత్సరంలో గంజాయి అక్రమ రవాణకు పాల్పడుతున్న వారిపై 88 కేసులు నమోదు చేసి, 2,157 కిలోల గంజాయి, 78 గ్రాముల నల్లమందును, అక్రమ రవాణకు వినియోగించిన 30 వాహనాలను సీజ్ చేయడంతో పాటు, 288మంది నిందితులను అరెస్టు చేసామన్నారు. అదే విధంగా ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 52 కేసులు నమోదు చేసి, 346 కిలోల గంజాయి, అక్రమ రవాణకు వినియోగించిన 21 వాహనాలను సీజ్ చేయడంతోపాటు, 155మంది నిందితులను అరెస్టు చేసి, రిమాండుకు తరలించామని జిల్లా ఎస్పీ తెలిపారు. గంజాయి నేరాలను తీవ్రంగా పరిగణించి, ఆయా కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేయడంతోపాటు, కోర్టు విచారణలో ఉన్న కేసుల్లో ప్రాసిక్యూషను ఎప్పటికప్పుడు గమనిస్తూ, సాక్ష్యాధారాలను ప్రవేశపెడుతూ, నిందితులు శిక్షింపబడే విధంగా చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

# ఆయన కలలు గన్న సమాజం కోసం మనం అందరం కృషి చేద్దాం



### ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి.





**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన మాట ప్రకారం అంబేద్కర్ విగ్రహా ఏర్పాటు కొరకు రూ.15,000/- అంబేద్కర్ యువజన సేవా సంఘం వారికి అందజేసిన ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి. ఎమ్మెల్యే సేవా దృక్పథంతో హర్షాన్ని వ్యక్తపరిచిన పావాడ గ్రామస్తులు. దళితుల అభ్యున్నతకు నా వంతు కృషి చేస్తా - ఎమ్మెల్యే. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి. జామి:- ఆధునిక భారతదేశ చరిత్రను చూస్తే అంబేద్కర్ ముందు అంబేద్కర్ తరువాత అని చెప్పుకోవాలని..ఎన్నో తరాలుగా సమాజంలో పాతుకొని పోయిన మూఢ నమ్మకాలు, మనుషులకు మనుషులకు మధ్య నిలబడిన అడ్డుగోడలను కూకటి వేళ్ళతో సహా పెకిలించి వేసిన మహానుభావుడు మన డా. బీఆర్ అంబేద్కర్ అని ఎస్ కోట శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి తెలిపారు... జామి మండలం పావాడ గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నూతన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పాల్గొనడం జరిగింది...అనంతరం వారి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు... మనుషుల మధ్య అంతరాలు లేని, హెచ్చు తగ్గులు లేని సమాజాన్ని అంబేద్కర్ కలలుగన్నారు, ప్రతీ ఒక్కరికీ సమాన అవకాశాలు ఉండాలి అని తపించారు, విద్య లోను, ఉపాధి లోను, అవకాశాలు లేక సమాజానికి దూరంగా మిగిలిపోయి, పీడింపబడుతున్న బడుగు, బలహీన వర్గాలకు సమాన హక్కులు కలిపించడమే కాకుండా,వారికి కూడా రాజ్యాధికారం మీద హక్కులు కల్పించిన మహనీయుడు మన అంబేద్కర్ గారన్నారు... ఆయన కలలు గన్న సమాజం కోసం మనం అందరం కృషి చేయాలి అని అన్నారు... ఈ కార్యక్రమంలో పావాడ సర్పంచ్ జ్యోతి, మండల ప్రధాన కార్యదర్శి వర్రీ రమణ, రెడ్డి పైడి బాబు,లక్ష్మి,ధనియాల పైడిరాజు మరియు తెలుగుదేశం జనసేన బీజేపీ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా నుండి టిడిపిలోకి 40 కుటుంబాలు చేరిక

### గుత్తి లో వైసీపీ ఖాళీ అవుతుంది ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



**గుంతకల్లు జూన్ 22 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో ఆలూరు పట్టణం నందు గుత్తి మండలం ఊబిచర్ల గ్రామం లో వైసీపీ సర్పంచ్ చితంబరి 40 కుటుంబాలతో వైసీపీ నుండి టీడీపీ పార్టీ లోకి చేరారు. టిడిపి పార్టీ లో చేరిన వారికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పార్టీ కండువా కప్పి సాధరంగా ఆహ్వానించారు. అనంతరం సర్పంచ్ చితంబరి మాట్లాడుతూ వైసీపీ పార్టీలో సర్పంచ్లకు కనీసం మర్యాద కూడా లేదని కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలు చాలా సంతోషం గా ఉన్నారని గుంతకల్లు నియోజకవర్గం లో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గుంతకల్లు నియోజకవర్గం లో అభివృద్ధి చేస్తూ, కార్యకర్తలని ఎంతో బాగా చూసుకుంటా వారికీ అండగా నిలుస్తున్నారని అందుకే టీడీపీ లో చేరుతున్నామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడు తూ గుత్తి నుండి రోజు రోజుకి తండోప తండాలుగా వైసీపీ నుండి టీడీపీ లోకి చేరుతున్నా రని త్వరలో గుత్తి వైసీపీ ఖాళీ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో గుత్తి పట్టణ మరియు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## గత పాలకుల అవినీతి కప్పి పుచ్చుకోడానికే వైసిపి డ్రామాలు.

మండల టిడిపి నాయకులు..



**పాతపట్నం, జూన్ 22 ప్రజా జ్యోతి న్యూస్..** గత ఐదు సంవత్సరాల వైసిపి ప్రభుత్వ పాలనలో చేసిన అవినీతి, అన్యాయం, రాక్షస పాలన లో, లిక్కర్ స్కాం బయట కు రావడం, ప్రజలు దృష్టి మరల్చడానికి వైసీపీ ధర్నాలు చేస్తున్నారు, టీడీపీ మండలం అధ్యక్షులు పైల బాబ్జ ఆరోపించారు, కూటమి ప్రభుత్వం, సంవత్సరం కాలం లో 70 శాతం ప్రజలు కు ఇచ్చిన హామీలు నెరవేర్చింది అదే వైసీపీ 10%కూడ మొదటి సంవత్సరం లొ నెరవేర్చలేదు అని అన్నారు. అమ్మ వడి, ఒక్క మెగా డిస్సీ తీయలేదు, 85 హామీలు ఇచ్చి తుంగలో తొక్కి, ప్రజలకు వెన్నుపోటు పొడిచింది వైసీపీ జగన్ రెడ్డి అని అన్నా రు, అందుకే 11 సీట్లుకు పరిమితం చేసి ప్రతి పక్షమే లేకుండా చేసారని విమర్శించారు టీడీపీ నాయకులు, సైలాడ సతీష్ ఆకాంద్రా సన్యాసిరావు,ఎస్.చిన్నయ్య, దుర్గా ప్రసాద్, తిరుపతిరావు, నందిగాం ఆనంద్, వెంకటరావు, కలమట భుజంగరావు, పలువురు పాల్గొన్నారు.. టిడిపి నాయకులు

## కొత్తూరు మండలం లో పలు శుభకార్యాల్లో పాల్గొన్న లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు.



**కొత్తూరు జూన్ 22, ప్రజా జ్యోతి న్యూస్..** పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన టోంపల శ్రీనివాసరావు, జ్యోతి దంపతుల కుమార్తె (జ్ఞానామృత) రజస్వల మహోత్సవంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన పాతపట్నం నియోజకవర్గం సీనియర్ నాయకులు లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్ రావు, అలాగే సోమరాజుపురం పంచాయతీ కి చెందిన గొల్లంగి పేట గ్రామానికి బైరి జగ్గారావు మనవరాలు మరియు బైరి గురుమూర్తి కుమార్తె రజస్వల మహోత్సవానికి లోతుగెడ్డ తులసీ వర ప్రసాదరావు హాజరైయ్యారు. ఆయనతోపాటు లోతుగెడ్డ లక్ష్మీ నారాయణ నాయుడు, లోతుగెడ్డ భగవాన్ నాయుడు, పడాల వెంకట క్రిష్ణ మొదలగు వారు పాల్గొన్నారు..

## టిడిపి మండల అధ్యక్షుడిగా ఎన్నికైన పైల బాబ్జి కి అభినందనలు తెలిపిన టౌన్ టిడిపి అధ్యక్షుడు సైలాడ సతీష్..



**పాతపట్నం జూన్ 22 ప్రజాజ్యోతి న్యూస్..** తెలుగుదేశం పార్టీ పాతపట్నం మండల అధ్యక్షునిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సందర్భంలో పాతపట్నం తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు సైలాడ సతీష్ అభినందనలు తెలియాచేసారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కష్టకాలంలో కూడా పార్టీని వీడకుండా కొనసాగుతూ ,పార్టీ బలోపేతానికి నిరంతరం అలుపెరగని పోరాటం చేస్తూ పార్టీ శ్రేణులతో మమేకమై ఎన్నో సేవా కార్యక్రమాల్లో భాగస్వాములై పార్టీను ముందుకు నడుపుతూ కృషి చేస్తున్న బాబ్జిని గుర్తించి రెండోసారి మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు చాలా సంతోషంగా ఉందని,తెలుగుదేశం పార్టీ అంటే కష్టపడిన కార్యకర్తలను గుర్తించే పార్టీ అని దీనికి ఉదాహరణ బాబ్జిని మండల అధ్యక్షుడిగా ఎన్నుకోవడమే ఒక నిదర్శనమని మళ్లీ రుజువు చేశారని కొనియాడుతు ఈ అవకాశం నమ్మకం కల్పించిన స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆసియాలను ముందుకు నడిపిస్తూ రాబోయే రోజుల్లో ఉత్సాహంగా పార్టీ కోసం పనిచేస్తూ ఇంకా ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు..

## ఆరోగ్యం మరియు పచ్చదనం పెంపునకు కృషిచేసిన రామకృష్ణ కు మై భారత్ గెస్ట్ ఆఫ్ ఆనర్ జ్ఞాపిక...



**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** శృంగవరపుకోట. సెంటర్ ఫర్ యోగా అండ్ మెడిటేషన్ (సిమ్) మరియు గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) స్వచ్ఛంద సంస్థలను ఏర్పాటు చేసి ఆరోగ్యం మరియు పచ్చదనం పెంపునకు కృషిచేసిన బి.రామకృష్ణ అరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలలలో భారత ప్రభుత్వ యువజన, క్రీడలు మంత్రిత్వశాఖ వారు మై భారత్ గెస్ట్ ఆఫ్ ఆనర్ జ్ఞాపిక ను బహుకరించారని రామకృష్ణ తెలిపారు ఈ కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, పి.చలపతి రావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కొండ బాబు, యన్.యస్.యస్.ప్రోగ్రాం అధికార్లు పి.నాగబాబు, వై.విజయలక్ష్మి, యమ్.అనిత కుమారి, కె. బాలరాజు, డాక్టర్ స్వర్ణ లత, డాక్టర్ లక్ష్మి, యల్.యమ్.యస్.గణేష్, బి.లచ్చన్న తదితర అధ్యాపకులు ఉన్నారని అన్నారు.

# జిందాల్ కంపెనీ భూనిర్వాసితులతో మాట్లాడిన ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి.





**శృంగవరపుకోట, విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము :** త్వరలో అధికారుల సమక్షంలో గ్రామసభలు పెట్టి ద్వారా రైతులందరికీ న్యాయం జరిగే విధంగా చూస్తాం కోళ్ల లలిత కుమారి. శృంగవరపుకోట:- శృంగవరపుకోట మండలం ముషిడిపల్లికి చెందిన గిరిజన రైతులు నిర్వహించడం ర్యాలీ లో రైతులను కలిసిన ఎస్.కోట శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి. 2007లో జిందాల్ అల్యూమినియం ఫ్యాక్టరీ కి అతి తక్కువ ధరకు భూములు ఇచ్చామని, పరిశ్రమలో ఉద్యోగాలు కల్పిస్తామని యాజమాన్యం చెప్పిందన్నారు... నేటికీ సుమారు 17 సంవత్సరాల గడిచిన ఎటువంటి ఫ్యాక్టరీ పెట్టకపోగా భూములను ప్రైవేట్ వ్యక్తులకు అధిక ధరకు అమ్ముకోవడంపై అభ్యత్యరం వ్యక్తం చేశారు...తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, భూమి ఇచ్చిన తమకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు... ఎమ్మెల్యే మాట్లాడుతూ" జిందాల్ కంపెనీ కి భూమిలిచ్చిన భూ నిర్వాసితులందరికి న్యాయం చేస్తామని త్వరలో గ్రామాలలో అధికారుల సమక్షంలో గ్రామ సభలు నిర్వహించడం ద్వారా నిజమైన భూ నిర్వాసితులను గుర్తించి వారందరికీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని... మన ప్రాంతానికి కంపెనీలు వస్తే మన పిల్లల భవిష్యత్తులు బాగుపడతాయని అందుకుగాను మీరందరూ సహకరించాలని రైతులను కోరారు... ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్రశేఖర్,క్లస్టర్ ఇంచార్జ్ ఇందుకూరి శ్రీనివాసరాజు,ప్రధాన కార్యదర్శి జుత్తాడ రామసత్యం, ఆడారి మహేష్, శివ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు

# రచయిత వాడ్రేవు వీరలక్ష్మి దేవికి

## రసధుని సాహితీ పురస్కారం.

**పాలకొల్లు. ప్రజా జ్యోతి రిపోర్టర్. కొట్టి రామం. జూన్ 22.** పాలకొల్లులోని రసధుని సాహితీ సంస్థ ప్రతీ ఏటా ఇచ్చే పెద్దిబొట్ల బ్రహ్మయ్య స్మారక పురస్కారాన్ని 2025 సంవత్సరానికి ప్రముఖ రచయిత వాడ్రేవు వీరలక్ష్మి దేవికి అందజేశారు. స్థానిక లయన్స్ క్లబ్ కాన్ఫరెన్స్ హాల్ నందు ఆదివారం జరిగిన రసదుని సాహితీ పురస్కారం, నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం సభలో రసదుని గౌరవ అధ్యక్షులు పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ సోదరులు వీరలక్ష్మి దేవికి నగదు పురస్కారం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా సభలో పాల్గొన్న సాహితీ వేత్త వసుధారాణి మాట్లాడుతూ వీరలక్ష్మీ దేవి రచనలు, కథా సంకలనాలు మానవ జీవితంలోని ప్రేమనీ, స్వేచ్ఛా కాంక్షనీ, మృగ్యమైపోతున్న విలువలను బలంగా పట్టి చూపిస్తాయన్నారు. కవి రెంటాల శ్రీవేంకటేశ్వరరావు మాట్లాడుతూ వీరలక్ష్మీ దేవి మంచి రచయిత్రి మాత్రమే కాదనీ మంచి స్నేహితురాలు, నాయకురాలు, అన్వేషి అనీ ఆమె రచనలలో ఆంతరంగిక స్వేచ్ఛ కోసం పెనుగులాట కనిపిస్తుందని అన్నారు. గుత్తికొండ కొండలరావు మాట్లాడుతూ సాహిత్యంలో స్త్రీల పాత్ర చాలా గొప్పదని, వీరలక్ష్మీ దేవి తాను చూసిన సమాజాన్ని, అసమానతలను, ప్రేమానురాగాలను తన రచనలలో ఎంతో వైవిధ్యంగా చెప్పారన్నారు. పురస్కార గ్రహీత వాడ్రేవు వీరలక్ష్మిదేవి మాట్లాడుతూ తాను ఇప్పటి వరకు ఎన్నో పురస్కారాలు అందుకున్నా ఈ 2025 రసధుని సాహితీ పురస్కారం తనకెంతో ప్రత్యేకమైనదిగా బావిస్తున్నానన్నారు. తనకుసాహితీ పురస్కారం అందజేసినందుకు రసధుని సాహితీ సంస్థ కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. సభలో తొలుత రసధునికి నూతనంగా ఎన్నికయిన అధ్యక్షులు కొట్టి భాస్కరావు ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి వెంకట రత్నం తదితర కార్యవర్గ సభ్యులచే సలహా మండలి సభ్యులు చేగొండి వివి సత్యనారాయణ మూర్తి ప్రమాణ స్వీకారం చేయించారు.వంగా నరసింహరావు మాడభూషి కృష్ణ ప్రసాద్ లు నూతన కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కోశాధికారి ముచ్చర్ల వెంకట సత్యనారాయణ, చెగొండి రంగారావు, జె జయదుర్గా రావు, చల్లా అన్నపూర్ణేశ్వరరావు, బి ఎస్ ఎన్ ఎల్ రాజు, ర్యాలీ విష్ణు మూర్తి, మామిడిశెట్టి శ్రీనివాస్, కోలాటి పెద్దిరాజు,దంగేటి గోపాల కృష్ణ,



యర్రంశెట్టి రతన్ జీ, చిప్పాడ వామన మూర్తి, జవ్వాజి కళ్యాణ్, జి లక్ష్మీనారాయణ, వై. ప్రభాకర శాస్త్రి, బొండాడ మోహన్ గుప్త, పెనుమాక రామ్మోహన్, యామన విజయలక్ష్మి, అంగర మానస,గంటా ముత్యాలరావు నాయుడు, కానూరి జి బాబు, కలిదిండి వెంకట కృష్ణ వర్మ, కలిదిండి వెంకట పతి వర్మ, తిరుపతి రాజు,చుండూరి రంగయ్య నాయుడు,పోలిశెట్టి శ్రీ శ్రీ,.మండేల పెద్ద, గుండుమోగుల వీరాస్వామి, గంధం యేసు పాదం, రాజా తాతయ్య, గుడాల హరిబాబు, తాళా బత్తుల వెంకటేశ్వర రావు, పుత్సల రామలింగేశ్వర రావు, శివాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

# హంద్రీనీవా ద్వారా పిల్లకాలువల సాగునీరు అందిస్తే రైతులకు,రైతు కూలీలకు ఉపాధి లభిస్తుంది

## గ్రామీణ శ్రామికుల సర్వే నిర్వహించిన సిపిఎం

**గుంతకల్లు జూన్ 22 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు నియోజకవర్గం లో హంద్రీనీవా కాలువ ద్వారా పొలాలకు సాగునీరు అందిస్తే రైతులకు, రైతు కూలీలకు ఉపాధి లభించి వలసలు తగ్గుతాయని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, కార్యదర్శి వర్గ సభ్యులు సాకే నాగరాజు పేర్కొన్నారు.ఆదివారం గుంతకల్లు మండలంలోని తిమ్మాపురం మరియు ధోనిముక్కల ,నల్లగొండ, కసాపురం ,దోశలడికి,బుగ్గ సంఘాల గ్రామాలలో వ్యవసాయయేతర శ్రామికుల ను సిపిఎం పార్టీ బృందం కలిసి వారి యొక్క సమస్యలను కష్టాలను అడిగి తెలుసుకోవ డం జరిగింది. సిపిఎం పార్టీ బృందానికి శ్రామికులు వారి యొక్క సమస్యలను వివరించడం జరిగింది. ప్రధానంగా భూమిలేని పేదలు, చిన్న,సన్నకారు రైతులు వ్యవసాయ కూలీలుగా చేస్తూ వ్యవసాయతర పనులైన ఆటో హమాలీలు.భవనిర్మాణ కార్మికులుగా చేతివృత్తుదారు లుగా గ్రామీణ ఉపాధి హామీ కూలీలుగా ఇతర వ్యవసాయ ఏతర పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరికొందరు ఇతర ప్రాంతా లకు వలసలు వెళ్లి హమాలీలు గా ఇతర పనులు చేసుకుంటూ తిరిగి నెలకు రెండు నెలలకు వారి యొక్క గ్రామానికి చేరుకోవడం జరుగుతుందని ఆవేదన చెందుతున్నారు.ఈ ప్రాంతంలో ఎక్కువ శాతం భూమి వర్షాధారం మీదే ఆధారపడి ఉండటం వలన అనావృష్టి ఎక్కువగా ఉంది పక్కనే హంద్రీనీవా కాల ఉండి కూడా మా చేనులకు సాగు నీరు రాలేని పరిస్థితి మా చేనులకు పిల్లకాలువలు ఏర్పాటు చేసి సాగునీ అందిస్తే వ్యవసాయం పెరుగుతుంది. కూలీలకు పని ఉంటుంది అన్ని వృత్తుల వారు బ్రతకడానికి అనుకూలంగా ఉంటుంది అని బృందం దృష్టికి వ్యవసాయ ఏతర కార్మికులు తీసుకు రావడం జరిగింది.తక్షణమే ప్రభుత్వం ఈ మండలంలో వ్యవసాయం అభివృద్ధి చెందే విధంగా చర్యలు తీసుకొని వ్యవసాయ ఏతర శ్రామికుల సమస్యలను రైతుల సమస్య లను చేతివృత్తిదారుల సమ స్యలను వెంటనే



పరిష్కరించా లని సిపిఎం పార్టీ బృందం ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు గుంతకల్లు సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్ కార్యదర్శి వర్గ సభ్యులు సాకే నాగరాజు, కసాపురం రమేష్, సురేంద్ర, ఎస్కేయం భాష, వీరన్న, ఖాదర్ బాష శ్రామికులు మొదలగువారు పాల్గొనడం జరిగింది.

# భూమికోసం భుక్తి కోసం పేదల విముక్తి కోసం పోరాడిన పార్టీ సిపిఐ

## దున్నే వాడికి భూమికోసం ఇండ్లు లేని పేదలకు ఇళ్ల స్థలాల కోసం పోరాడింది పోరాడుతున్నది సిపిఐ
## కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలను నిర్వహిస్తున్నది సిపిఐ



**జూన్ 22 తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** తిరుచానూరు భారత కమ్యూనిస్టు పార్టీ 2 వ శాఖ మహాసభ జిల్లా సమితి సభ్యులు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి గారి అధ్యక్షతన ప్రైవేట్ హోటల్ లో జరిగింది ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాద్ రెడ్డి గారు జిల్లా పార్టీ కార్యదర్శి పి మురళి గారు హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం పేదల విముక్తి కోసం అనేక పోరాటాలను సిపిఐ పార్టీ సాధించిందని దున్నేవాడికి భూమికోసం అనేక భూపోరాటాలను చేసి పేదరైతాంగానికి భూములు పంచిన ఘనత సిపిఐది అని అలాగే ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాల కోసం అనేక భూ పోరాటాలు నిర్వహించి తిరుపతి పరిసర ప్రాంతాలలో 26 కాలనీల నిర్మాణం చేపట్టి పేదల సొంత ఇంటి కలను నెరవేర్చిన ఏకైక పార్టీ సిపిఐ అని ఆయన కొనియాడారు భారత స్వాతంత్ర పోరాటంలో సంపూర్ణ స్వాతంత్రం నినాదంతో మొట్టమొదటి తీర్మానాన్ని ప్రవేశపెట్టిన ఘనత సిపిఐ ది అని అలాగే 100 సంవత్సరాలు శత జయంతి ఉత్సవాలను సిపిఐ నిర్వహించుకుంటూ ఉందని అందులో భాగంగా ప్రతి శాఖ నుండి జాతీయ కమిటీ వరకు మహాసభలు జరుపుకొని నూతన నాయకత్వాన్ని ఎన్నుకుంటూ రానున్న కాలంలో చేపట్టవలసిన పోరాట కార్యక్రమాలకు రూపకల్పన జరుగుతోందని మహాసభల సందర్భంగా సిపిఐ 100 జండాలు తో ర్యాలీలు చేపట్టడం 100 చెట్లు నాటడం 100 కాగలాలతో ప్రదర్శన నిర్వహించడం లాంటి వినూత్న కార్యక్రమాలకు సిపిఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా పిలుపునివ్వడం జరిగిందని ఈ పిలుపును అన్ని శాఖ పరిధిలో అమలుపరుస్తున్నారని అన్ని ప్రాంతాల్లో జరుగుతోందని మనం కూడా అలాగే ప్రజల్ని భాగస్వాములు చేసి 100 చెట్లు నాటించే ప్రయత్నం చేయాలి అని వారు అన్నారు ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి జెల్లా విశ్వనాథం. జిల్లా సమితి సభ్యులు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి పార్టీ శాఖ కార్యదర్శి ఎం ఆర్ పల్లి శ్రీనివాసులు బైరాగి పట్టెడ శ్రీనివాసులు గత రెండు సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో జరిగిన కృషిని వివరించడం జరిగింది అలాగే పార్టీ నిర్వహించాల్సిన కార్యక్రమాలను కూడా వారు వివరించడం జరిగింది పార్టీ సభ్యులు సిహెచ్ రమణ మనోహర్ ఆచారి నరసింహ వర్ధన్ మస్తానమ్మ దేవేంద్ర ఆదయ్య శివశంకర్ బాబు మనీ సుమిత్ర జయరాం ముని శంకర్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక



**బాపట్ల జూన్ 22 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం 23 వ తేదీన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించబడనుందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రజలు తమ సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.అర్జీదారులు మీకోసం. ఏపీ. గవర్నమెంట్. ఇన్. వెబ్‌సైట్ ద్వారా తమ అర్జీలను ఆన్లైన్‌లో నమోదు చేసుకోవచ్చని, అలాగే అర్జీల స్థితిగతులను తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు నేరుగా ఫోన్ చేయవచ్చునని ఆయన తెలిపారు.

## జీవో నెంబర్.3 అమలు కోరుతూ సీ.ఎంను కలిసిన అరకు టి.డి.పి నాయకుడు వంతల



**నగేష్ అనంతగిరి జూన్. 22 ప్రజా జ్యోతి న్యూస్. రిపోర్టర్ శంకర్.** తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ శ్రీ నందమూరి తారక రామారావు ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన కాలంలో గిరిజన ప్రాంతంలో ఉన్నత విద్యను అభ్యసించిన యువతి.యువకులు ఉద్యోగ భద్రత రీత్యా జీ.వో నెంబర్.3 అమలుపరిచి చట్టబద్ధతకు శ్రీకారం చుట్టగా స్థానికులే వివిధ పోస్టుల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించేవారు. అయితే వై.ఎస్. ఆర్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జీవో నెంబర్.3 ని రద్దు చేయడంతో చదువుకున్న గిరిజన యువతి.యువకులు 75% శాతం ఉద్యోగ అవకాశాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది అంటూ. అరకు పార్లమెంటరీ నియోజకవర్గం పార్టీ ట్రెజరర్ వంతల నగేష్ విశాఖపట్నంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని కలిసి జీవో నెంబర్. 3 అమలుపరిచే విధంగా చట్టపరమైన చర్యలుతీసుకోవాలని కోరి విజ్ఞప్తి చేసినట్లు నాయకుడు నగేష్ ఆదివారం నాడు ప్రజా జ్యోతి కి వివరాలను అందించారు.

## మాజీ సైనికుల కుమారుడి వివాహ వేడుకకు రాష్ట్ర అధ్యక్షుడు హాజరు



**బాపట్ల జూన్ 22 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** పొన్నూరు మువ్వా గార్డెన్స్ లో ఆదివారం అంగరంగ వైభోగంగా జరిగిన చందోల్ మాజీ సైనికుల అసోసియేషన్ అధ్యక్షులు షేక్ దావూద్ కుమారుడు షేక్ షాహిద్ భాషా పర్వీన్ సుల్తానా వివాహ వేడుకకు రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు హాజరై, వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో బాపట్ల అసోసియేషన్ అధ్యక్షులు పుట్టా ఆది శేషా రెడ్డి, నిజాంపట్నం అధ్యక్షులు షేక్ సుల్తాన్ మెహబూబ్, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ గౌస్, చెరుకుపల్లి అధ్యక్షులు టీ. సుబ్బారావు, జిల్లా గౌరవాధ్యక్షులు ముహమ్మద్ ఆయుబ్, ఉపాధ్యక్షులు బాలా సాంబశివ రెడ్డి, రాష్ట్ర కమిటీ గౌరవ సలహాదారులు సుంకర శేషగిరి రావు, సీనియర్ మాజీ సైనికులు ఎస్.ఎం. సుభాని, డి. వెంకటేశ్వర్లు, రుక్మధరరావు తదితరులు పాల్గొన్నారు

## కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులతో ఎన్డీఏ కూటమి పాలనలో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని: వాసగిరి మణికంఠ ప్రత్యేక పూజలు



**గుంతకల్లు జూన్ 22 (ప్రజా జ్యోతి):** ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానం నందు కుటుంబ సభ్యులు మరియు స్థానిక జనసేన శ్రేణులతో కలిసి స్వామివారికి ఆకుపూజ సేవ చేసుకున్న జనసేన గుంతకల్లు నియోజక వర్గం సమన్వయకర్త వాసగిరి మణికంఠ.అనంతరం వేద పండితులు, ఆలయ అధికారులు వాసగిరి శ్వేతా మణికంఠ పుణ్యదంపతులకు మరియు వారి కుటుంబ సభ్యులకు జనసేన శ్రేణులకు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# తిరుపతి నగరంలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలి.

ప్రచురణార్థంతిరుపతి అభివృద్ధికి టీటీడీ ప్రత్యేక వందకోట్లు నిధులు కేటాయించాలి.
సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వీ రాంభూపాల్ డిమాండ్.






**జూన్ 22 తిరుపతి జిల్లా ప్రతినిధి (ప్రజాజ్యోతి)** తిరుపతి నగరంలో పారిశుధ్య సమస్య చాలా తీవ్రంగా ఉందని ఎక్కడ చూసినా డ్రైనేజీ నీళ్లు రోడ్లపై ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతున్న మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని నేడు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో యశోద నగర్, ఏ ఎస్ ఆర్ కాలనీ, శివ జ్యోతి కళ్యాణ మండపం ప్రాంతాల్లో సిపిఎం బృందం పర్యటించడం జరిగింది. ఈ పర్యటనలో సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి రాంభూపాల్ ఇతర నేతలు పర్యటి%శీ%చి అనేక సమస్యలను గుర్తించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి రాంభూపాల్ మాట్లాడుతూ ప్రతినిత్యం లక్షలాదిమంది భక్తులు యాత్రికులు వచ్చి వెళుతుంటారని తిరుమలకు వచ్చే భక్తులు మొదట తిరుపతికి వచ్చిన తరువాతే తిరుమలకు వెళతారని వచ్చినటువంటి భక్తులు ఎక్కడ డ్రైనేజీ నీళ్లు దుర్గంధంలో అడుగులు పెట్టి మళ్లీ శ్రీవారి దర్శనానికి వెళుతున్నారని అన్నారు. తిరుపతిలోని 50 డివిజన్లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని ఈ సమస్య పట్ల దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని ఎప్పుడో 25 ఏళ్ళు 30 ఏళ్లకు మునుపు చేసినటువంటి డ్రైనేజీ పైపులైన్ల వల్ల ఇప్పుడు జనాభా పెరిగిపోవడంతో అప్పుడు వేసిన పైపులైన్లు సరిపోవడం లేదని మొత్తం జనాభా దృష్టిలో పెట్టుకొని కొత్త డ్రైనేజీ సిస్టం తీసుకురావాలని అన్నారు. ఏ ఎస్ ఆర్ కాలనీలో గత నాలుగు నెలల క్రితం తెలుగు గంగా నీళ్లలో డ్రైనేజీ నీళ్లు కలుషితమై ప్రజలు అనారోగ్యాల పాలో అవుతుంటే రోడ్డును తవ్వి ఆ సమస్య పరిష్కరిస్తామని చెప్పి నాలుగు నెలలు పూర్తవుతున్న నేటికి తవ్విన రోడ్డును పుడ్చలేదు కలుషితమైన డ్రైనేజీ సమస్యను, తెలుగు గంగ సమస్యను పరిష్కరించలేదని ఈ సమస్యలు పరిష్కరించకుండా ఇంతకంటే ముఖ్యమైన పనులు కార్పొరేట్ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యత తీసుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో స్థానిక ప్రజలను తీసుకుని వచ్చి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి సుబ్రహ్మణ్యం కే వేణుగోపాల్,మాధవ్, బుజ్జి, శ్రీను, సుందరం, ముకేష్, తదితరులు పాల్గొన్నారు.

## యువత పోరును జయప్రదం చేయండి:

యువతకు వైకాపా అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతి రెడ్డి పిలుపు.



**గుంతకల్లు జూన్ 22 (ప్రజా జ్యోతి):** నేడు అనంతపురం కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే యువత పోరు కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతి రెడ్డి పిలుపు నివ్వటం జరిగింది. ఈ సందర్భంగా నైరుతి రెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నా కార్యక్రమం లో భాగంగా సోమవారం అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే యువత పోరుకు గుంతకల్లు నియోజకవర్గం వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగ యువతి, యువకులు, విద్యార్థులు మరియు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు,అభిమానులు బారి స్థాయిలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## రైలు ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి



**గుంతకల్లు జూన్ 22 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో మొలగవల్లిబి నేమకల్లు రైల్వే స్టేషన్ల మధ్య సుమారు 65 సంవత్సరాల వయసు గల వ్యక్తి ఏదో కారణం చేతనో లేక మానసిక స్థితి సరిగా లేఖనో రైల్వే ట్రాక్ పైన నడుచుకుం టూ కర్ణాటక ఎక్స్ప్రెస్ రైలు ఢీకొనడం చేత రైలు కింద పడి తీవ్రమైన గాయాలతో మరణించినాడు.కర్ణాటక ఎక్స్ప్రెస్ లోకో పైలట్ అయినటువంటి రాజేష్ నేమకల్లు డిప్యూటీ ఎస్ ఎస్ కి సదరు విషయాన్ని తెలపడం వలన ఆదివారం ఉదయము 10.40 గంటలకు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం అయినది.ఈ వ్యక్తి వయసు సుమారు 65-70 సంవత్సరముల మధ్య వుండును,నలుపురంగు తెలుపు రంగు వెంట్రుకలు, ముఖం పూర్తిగా నలిగిపోయి నది,గ్రే అండ్ బ్లూ లైన్స్ ఫుల్ షర్ట్, బ్లూ కలర్ రెడీమేడ్ జీన్స్ ప్యాంట్, మృతుడు గుర్తించు టకు ఎటువంటి ఆనవాళ్లు లేవు కనుక ఎవరైనా మృతుడి ని గుర్తుపట్టిన యెడల గుంతకల్లు రైల్వే పోలీసు ఎస్సై కే గోపాల్ కి 9849157634 కు ఫోన్ చేసి తెలియజేసి దర్యాప్తునకు సహకరించవల సిందిగా తెలిపారు.

## మర్యాదపూర్వక కలయిక.



**విజయనగరం జిల్లా, ప్రజా జ్యోతి న్యూస్, స్టాఫ్ రిపోర్టర్ రాము:** విజయనగరం జిల్లా కోర్టులో నిర్వహించే న్యాయ సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి మరియు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి శ్రీ జస్టిస్ రవి చీమలపాటి జూన్ 22న జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపీఎస్ జిల్లా కోర్టులో మర్యాదపూర్వకంగా కలసి, పూల మొక్కను అందజేసి, స్వాగతం పలికారు.

# స్నేహితులంతా ఒకచోట

1987-88 పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆనందోత్సాహాల మధ్య చిన్న నాటి బాల్య స్మృతులు ,సన్నివేశాలు నెమరవేసుకున్న పూర్వపు విద్యార్థులు ఆటపాటలతో నెలకొన్న పండగ వాతావరణం
ఘనంగా ఉపాధ్యాయులకు సన్మానయ్





**హిరమండలం, ప్రజా జ్యోతి న్యూస్ :** స్నేహితులంతా ఒకచోట కలుసుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ తమ బాల్యాన్ని గుర్తు చేసుకుని సందడి చేశారు. హిరమండలం మండల కేంద్రంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1987 -88 వ సంవత్సరం 10 వ తరగతి విద్యార్థులందరూ ఆదివారం నాడు కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక ఓ ప్రవేట్ కళ్యాణ మండపంలో ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 1987-88 పూర్వపు విద్యార్థులు , ఉపాధ్యాయులు పాల్గొని చిన్న నాటి బాల్య స్మృతులను ,సన్నివేశాలను గుర్తు చేసుకుని సందడి చేశారు. అనంతరం పలువురి సభ్యులను ఘనంగా సన్మానించారు. ఆనాటి అనుభవాలను , అనుబంధాలను వేదికపైకి ఎక్కి పలువురు ప్రసంగించారు. 10 వ తరగతి పరీక్షలు అనంతరం ఎక్కడెక్కడో ఉన్నత చదువులను అభ్యసించి నేడు ఉన్నత స్థానం లో స్థిరపడిన విషయాలని గుర్తుచేసుకున్నారు. అప్పటి ప్రధాన ఉపాధ్యాయులు తోట గోపాల రావు ,ఫిజిక్స్ మాష్టారూ ఏ సోమేశ్వర రావు , మ్యాథమేటిక్స్ మాష్టర్ అగుతుముడి వసంత రావు ,సోషల్ స్టడీ మాష్టర్ కారక వలస సత్యన్నారాయణ మాష్టర్ , ప్రస్తుత ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు టి కేశవ రావు, జూనియర్ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ ,అందవరపు బుచ్చి బాబు ను సన్మానించారు. అనంతరం అప్పటి కొంతమంది ఉపాధ్యాయులు, తోటి మిత్రులు భౌతికంగా దూరమైన వారిని జ్ఞాపకం చేసుకున్నారు. ఉద్యోగాలు, జీవనోపాధి మార్గాలు అన్ని పంచుకుంటూ అప్పుడు చదువుకున్న రోజుల్లో మధ్యాహ్నం బాక్సులు విప్పి భోజనాలు చేసే విధానాన్ని తలచుకుంటూ అందరూ కలిసి భోజనాలు చేసుకుంటూ సాయంత్రం వరకు ఆటపాటలతో సందడిగా గడిపారు. వీరిలో కోర్టు విద్యార్థులు బెహరా అంతవరకు శివకుమార్ లాడి సాంబమూర్తి కోటిని తిరుమల బోయిన శ్రీనివాస్ అందవరపు ధర్మేంద్ర డి వాసు రాజేష్ జగ్గు నాయుడు వెంకటరమణా పి గణపతి బుల్లెట్ కుర్తి లక్ష్మణ అందవరపు బాలగంగాధర్ తిలక్ పి.బాలసుందర్రావు తో పాటు సుమారుగా 80 మంది వరకు విద్యార్థులు పాల్గొని సందడి చేశారు.

## అభివృద్ధి పథంలో ఆమదాలవలస నియోజకవర్గం

అద్దం లాంటి అందమైన రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు
ఎమ్మెల్యే కూన రవికుమార్



**ఆమదాలవలస , ప్రజా జ్యోతి న్యూస్:** కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలన లో ఆమదాలవలస నియోజకవర్గం లో అన్ని గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నాయని ఆమదాలవలస ఎమ్మెల్యే ,రాష్ట్ర పి. యూ.సి చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆమదాలవలస మండలం లోని కనుగుల వలస గ్రామ పంచాయతీలో సుమారు కోటి రూపాయలు తో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు , డ్రైనేజీ కాలువలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 338 కోట్లు రూపాయలుతో ఆమదాలవలస నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అద్దం లాంటి అందమైన రోడ్లు, డ్రైనేజీ కాలువల నిర్మాణాలను చేపట్టడం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొకటిగా నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలను పొందుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను సర్వాంగ సుందరంగా మార్చడమే తన అభిమతమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో కూటమి ముఖ్య నాయకులు కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ , నారాయణ పురం ప్రాజెక్ట్ చైర్మన్ సనపల ఢిల్లేశ్వర రావు , తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత , బీజేపీ ఇంచార్జి పేడాడ సూరపునాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు కనుగులవలస సర్పంచ్ నూకరాజు , కనుగులవలస ఎంపీటీసీ పొన్నాడ అనసూయమ్మ,కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామీణ శ్రామికుల సర్వే

హొసూరు గ్రామంలో సర్వే నిర్వహిస్తున్న సిపిఎం పార్టీ నాయకులు




**ప్రజా జ్యోతి పత్తికొండ** పత్తికొండ మండలం హొసూరు గ్రామం నందు ఆదివారం జిల్లా సిపిఎం పార్టీ ఆదేశాల మేరకు పత్తికొండ మండల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గ్రామీణ శ్రామికులక సర్వే నిర్వహించారు. ఈ సర్వే పత్తికొండ మండలం హొసూరు గ్రామం నందు సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి, ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో గ్రామీణ శ్రామికుల సర్వే నిర్వహించడం జరుగుతుందని. ఈ సర్వే ద్వారా రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు సర్వే ఘనంగాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ముందుంచి గ్రామీణ ప్రాంతాల్లో శ్రామిక వర్గం పడుతున్న కష్టాలను వారికి ఇస్తున్న వేతనాల విధానాలను తెలియపరచి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న శ్రామికులకు ఉపాధి ఉపాధియేతర పనుల్లో వేతనాలు పెంపు పై పూర్తిస్థాయిలో నివేదికలు పంపడానికి ఈ సర్వే గ్రామీణ ప్రాంత శ్రామికుల తరఫున ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు గంగన్న, సిఐటియు నాయకులు ఎం. రవిచంద్ర, హొసూరు వ్యవసాయ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు


## పాలమూరులో డిఫెన్స్ ప్రాజెక్టు

**మహబూబ్ నగర్ :** మహబూబ్ నగర్ జిల్లాలో ప్రతిష్టాత్మక రక్షణ రంగ ప్రాజెక్ట్ ఏర్పాటు పై ఆశలు రేకెత్తుతున్నాయి. సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను విస్తరణకు దేవరకద్ర మండలంలో అవకాశాలను పరిశీలిస్తున్నారు శాస్త్రవేత్తలు, అధికారులు. ఇందుకోసం ప్రభుత్వ తరఫున అన్ని విధాల సహకరిస్తామని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు.త్వరలోనే రాష్ట్రంలో మరో బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్... అక్కడ ఏర్పాటుకు స్థల పరిశీలనగడచిన కొన్నేళ్లుగా దేశ రక్షణ వ్యవస్థను బలోపేతంపై భారత్ దృష్టి సారించింది. ఈ క్రమంలోనే సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను విస్తరించేందుకు ప్రణాళికలు వేస్తున్నారు. ఆపరేషన్ సింధూర్ తర్వాత బ్రహ్మోస్ క్షిపణుల ఉత్పత్తిని పెద్ద ఎత్తున పెంచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే హైదరాబాద్ లోని బాలాపూర్ లో ఈ క్షిపణుల తయారీ యూనిట్ నెలకొల్పబడి ఉంది. దీన్ని విస్తరించాలనే ప్రణాళికలో భాగంగా స్థలాల కోసం అన్వేషణ సాగుతోంది. అయితే ఈ నెల 18న హైదరాబాద్ లో సీఎం రేవంత్ రెడ్డితో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో బ్రహ్మోస్ ఏరోస్పేస్ విస్తరించాలని సీఎం రేవంత్ రెడ్డి ప్రతినిధులను కోరారు. డిఫెన్స్ కారిడార్ ను ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్, బెంగళూరు ప్రాంతాలు అనుకూలమైనవన్నారు. ఇప్పటికే హైదరాబాద్ లో పలు డిఫెన్స్ సంస్థలున్న నేపథ్యంలో బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థను సైతం విస్తరించాలని కోరారు. ఇందుకోసం ప్రభుత్వ తరఫున అన్ని విధాల సహకరిస్తామని సీఎం రేవంత్ హామీ ఇచ్చారు.అలా సమావేశం ముగిసి మూడు రోజులు గడవకు ముందే బ్రహ్మోస్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో స్థల పరిశీలన చేపట్టారు. ఆఖీఆఒ జనరల్ ఆఫ్ బ్రహ్మోస్ డైరెక్టర్ డా, జైతీర్థ్ జోషి, ఆఖీఆఒ డైరెక్టర్ డా,జీ.ఏ శ్రీనివాస్ మూర్తి, బ్రహ్మోస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా, జీ. ఏ.ఎస్ సాంబశివప్రసాద్ మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని చౌదర్ పల్లి, బస్వాయిపల్లి గ్రామ శివారులోని భూముల పరిశీలించారు. వీరికి తోడుగా స్థానిక ఎమ్మెల్యే జీ మధుసూధన్ రెడ్డి సైతం భూముల పరిశీలనలో పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో సుమారు 400 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. బ్రహ్మోస్ మిస్సైల్ తయారీ యూనిట్, అనుబంధ సంస్థలకు అనుకూలంగా ఉంటుందని భావించారు. ఔఊ 44, ఔఊ 167 కు మధ్యలో ఉన్న ప్రాంతం కావడంతో రవాణా సౌకర్యాలు అనుకూలంగా ఉన్నాయి.

# టీవీలో తండేల్ మూవీ ప్రీమియర్ షో.. రాజు ఎప్పుడొస్తున్నాడంటే..!



నాగ్ చైతన్య కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచిన చిత్రం తండేల్. యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి కలయి కలో వచ్చిన 'తండేల్'చిత్రాన్ని చందూ మొండేటి తెరకెక్కిం చగా, ఈ మూవీకి వచ్చిన ఆదరణ అంతా ఇంతా కాదు. ఈ చిత్రం రూ.106 కోట్లకు పైగా ప్రపంచ వ్యాప్తంగా గ్రాస్ వసూల్ చేసిందని తండేల్ నిర్మాతలు ప్రకటించారు. రూ.70 కోట్లతో ఈ చిత్రాన్ని బన్నీ వాసు నిర్మించారు. గీతా ఆర్ట్స్ అధినేత, టాలీవుడ్ అగ్ర నిర్మాత అల్లు అరవింద్ సమర్పించిన సంగతి తెలిసిందే. లవ్, యాక్షన్, దేశభక్తి మిళితమైన ఈ చిత్రం ఆడియెన్స్ నుంచి సూపర్బ్ రెస్పాన్స్ ను సొంతం చేసుకుంది. థియేటర్ల వద్ద 'తండేల్' మూవీ కలెక్షన్ల ప్రభంజనం సృష్టించగా, అటు ఓటీటీలోనూ మంచి రెస్పాన్స్ వచ్చింది. కాగా ఈ చిత్రం ఇప్పుడు బుల్లితెర ప్రేక్షకులను కూడా అలరించడానికి సిద్ధంగా ఉంది. జూన్ 29న, 2025న సాయంత్రం 6 గంటలకు జీ తెలుగులో టెలివిజన్ ప్రీమియర్ కి రెడీ అయింది. ఈ మేరకు సదరు సంస్థ అధికారికంగా ప్రకటిస్తూ తమ సోషల్ మీడియాలో పోస్టు చేసింది.ఈ క్రమంలో చైతన్య, సాయి పల్లవి జంట రెండు తెలుగు రాష్ట్రాల టీవీ ఛానళ్లలో సందడి చేయనున్నారు. ఆదివారం రోజు ఈ జంట ప్రేక్షకులకి మంచి వినోదం పంచనున్నారు. తండేల్ సినిమాలో మ్యూజిక్‌తో పాటు చైతన్య, సాయి పల్లవి నటనకు కూడా విమర్శకుల నుంచి ప్రశంసలు లభించాయి. మొత్తమ్మీద ఈ డీసెంట్ ఎమోషనల్ లవ్ డ్రామా, బలమైన ఎమోషన్స్ అండ్ ఫీల్ గుడ్ సీన్స్ తో సాగుతూ బాగా ఆకట్టుకుంది. డీసెంట్ టేకింగ్ సినిమా స్థాయిని పెంచాయి. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి స్వరాలు అందించారు. సంగీతం కూడా ఎంతగానో ఆకట్టుకుంది. తండేల్ సక్సెస్ తో ఫుల్ జోష్ లో ఉన్న చైతన్య తన తర్వాతి సినిమాను కార్తీక్ దండు దర్శకత్వంలో చేస్తున్న సంగతి తెలిసిందే. చైతూ కెరీర్లో 24(%చీజ%24)వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ మూవీ థ్రిల్లర్ గా తెరకెక్కుతోంది. మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాకు వృష కర్మ అనే టైటిల్ ను పరిశీలిస్తున్నారు.





# ప్రేమలు బ్యూటీకి బర్త్‌డే విషెస్ తెలిపిన 'డ్యూడ్' టీమ్

ప్రేమలు సినిమాతో స్టార్ నటిగా గుర్తింపు తెచ్చుకుంది మల్లు బ్యూటీ మమితా బైజు. ఈ భామ ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతుంది. ఆమె ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం డ్యూడ్ ఈ సినిమాకు కీర్తిశ్వరన్ దర్శకత్వం వహిస్తుండగా.. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. 'లవ్ టుడే' 'డ్రాగన్' సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న ప్రదీప్ రంగనాథన్ ఈ సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నాడు. నేడు మమితా బైజు బర్త్‌డే కావడంతో ఆమెకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ.. కొత్త పోస్టర్‌ని పంచుకుంది. ఈ సినిమాలో మమితా కురల్ అనే పాత్రలో నటించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

# తెలుగమ్మాయిలకు 20 శాతమే.. ఇంత కష్టం ఎక్కడా లేదు



టాలీవుడ్‌లో తెలుగమ్మాయిలకు అవకాశాలు చాలా తక్కువ అనే కంప్లైంట్ ఎప్పటి నుంచో ఉంది. ఇది ఇప్పటికీ కొనసాగుతుందని చెబుతోంది యంగ్ హీరోయిన్ అనన్య నాగళ్ల టాలీవుడ్‌లో తెలుగమ్మాయిలకు 20 శాతం మాత్రమే అవకాశాలు వస్తాయని..దాని కోసమే పదేళ్లు కొట్టుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తోంది. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఇండస్ట్రీలో తెలుగు అమ్మాయిల పరిస్థితి ఎలా ఉంటుందో వివరించింది. 'తెలుగు అమ్మాయిలను చూస్తే గర్వంగా అనిపిస్తుంది. ఇండియాలో ఏ లాంగ్వేజ్ అమ్మాయికి అయినా ఇంత కష్టం ఉండదేమో. తెలుగులో మన వాళ్లకు 20 శాతం మాత్రమే అవకాశం ఉంటుంది. వందలో 80 సినిమాలకు పరభాష హీరోయిన్లనే తీసుకుంటారు. అదే మలయాళం, తమిళ్ తో పాటు ఇతర భాషల్లో చూస్తే..అక్కడ లోకల్ అమ్మాయిలకే 80 శాతం అవకాశం ఇస్తారు. ఇలా ఎక్కడ చూసిన తెలుగు అమ్మాయిలకు 20 శాతం మాత్రమే చాన్స్ ఉంటుంది. ఇందులోనే తమ టాలెంట్‌ని నిరూపించుకోవాలి. చిన్నప్పటి నంచి సినిమాలు చూసి ఇష్టం పెంచుకొని, పెరెంట్స్ ఒప్పించి ఇండస్ట్రీలోకి వస్తే.. ఈ 20 శాతం కోసమే పదేళ్లు కొట్టుకోవాలి. మిగతావాళ్లకి లోకల్‌తో పాటు మన దగ్గర కూడా 80 శాతం అవకాశాలు ఉంటాయి. అందుకే నాకు తెలుగు అమ్మాయిలను చూస్తే గర్వంగా ఉంటుంది. వాళ్లు మానసికంగా చాలా స్ట్రాంగ్‌గా ఉంటారు' అని అనన్య చెప్పుకొచ్చింది. ఇక ఇదే ఇంటర్వ్యూలో పొట్టేల్ సినిమాకు గాను తనకు వచ్చిన స్పెషల్ జ్యూరీ గద్దర్ అవార్డు గురించి మాట్లాడుతూ.. ఇలాంటి అవార్డు తనకు వస్తుందని అసలు ఊహించలేదని చెప్పింది. 'అవార్డులు ప్రకటించిన రోజు నా మూడ్ బాగోలేదు. ఇంట్లో పడుకొని ఉన్నాను. లేవగానే.. పాజిటివ్ విషయం గురించి థింక్ చేస్తూ.. ఏదైనా అవార్డు వస్తే బాగుండు అనుకున్నాను. అయితే ఆ రోజు గద్దర్ అవార్డులు ప్రకటిస్తారనే విషయం కూడా నాకు తెలియదు. బెడ్ రూం నుంచి హాల్‌లోకి రాగానే.. టీవీలో గద్దర్ అవార్డుల ప్రకటన న్యూస్ చూస్తూ.. 'ఇంత మంచి సినిమాలు చేస్తున్నా..నాక్కూడా వస్తే బాగుండు' కదా అని అన్నయ్యతో చెబుతున్నా..అంతలోనే నాకు పొట్టేల్ మూవీ నిర్మాత ఫోన్ చేసి'మన సినిమాకు అవార్డు వచ్చింది' అని చెప్పగానే షాక్ అయ్యాను. ఆరేళ్ల కెరీర్‌లో మీడియాతో పాటు ఇండస్ట్రీలో చాలా మంది సపోర్ట్ చేశారు. అందుకే నేను ఇప్పుడు ఈ స్థాయిలో ఉన్నాను' అని అనన్య చెప్పుకొచ్చింది



# విజయ్ దేవరకొండపై అట్రాసిటీ కేసు!

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండపై కేసు నమోదు అయింది. ఏప్రిల్ 26న జరిగిన రెట్రో సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో గిరిజనులను అవమానించలేలా మాట్లాడారంటూ విజయ్‌పై గిరిజన సంఘం నాయకుడు అశోఖ్ కుమార్ రాథోడ్ రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద విజయ్ దేవరకొండపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. హీరో వ్యాఖ్యలపై విచారణ జరిపుతున్నట్లు వారు వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్ 26న హైదరాబాద్‌లో తమిళ హీరో సూర్య హీరోగా నటించిన రెట్రో సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ ఈవెంట్‌కి విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా వెళ్లాడు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడి గురించి మాట్లాడుతూ.. ఇండియా పాకిస్తాన్‌పై దాడి చేయాల్సిన అవసరం లేదు.. అక్కడి ప్రజలకే విరక్తి వచ్చి పాక్ ప్రభుత్వంపై తిరగబడతారు. 500 ఏళ్ల క్రితం ట్రైబల్స్ కొట్టుకున్నట్లు.. బుద్ధి లేకుండా, కనీస కామన్ సెన్స్ లేకుండా ఇలాంటి పనులు చేస్తున్నారు. మనమంతా ఐకమత్యంగా ఉండాలి' అని విజయ్ అన్నారు. ఈ వ్యాఖ్యలు గిరిజనులను ఉగ్రవాదులతో పోల్చాయని, వారిని అవమానించాయని గిరిజన సంఘం నాయకుడు అశోక్‌కుమార్ రాథోడ్ రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేడయంతో విజయ్‌పై కేసు నమోదు చేశారు. ఈ వివాదంపై విజయ్ అప్పుడే స్పందించాడు. తాను ట్రైబ్స్ అనే పదం వాడిన మాట నిజమే కానీ.. దాని అర్థం గిరిజనులు కాదని చెప్పారు. 'వందల ఏళ్ల కిందట సమాజం, ప్రజలు గుంపులుగా వ్యవస్థీకృతమై ఉండేవాళ్లని నా ఉద్దేశం. అలాంటి సమయంలో రెండు వర్గాల మధ్య తరచూ ఘర్షణలు చోటు చేసుకునేవి. ఆ సెన్స్‌లోనే ట్రైబ్స్ అనే పదం వాడాను. అంతేకానీ, ఇప్పుడున్న షెడ్యూల్ ట్రైబ్‌ని ఉద్దేశించి నేను వ్యాఖ్యలు చేయలేదు. అయినా కూడా నా వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకొని హర్ట్ అయితే విచారం వ్యక్తం చేస్తున్నాను' అని విజయ్ అప్పుడే సోషల్ మీడియా వేదికగా వివరణ ఇచ్చాడు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com